Follow: @ANNTELUGU

20-04-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 113 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్












## కవితక్కను సీఎంగా చూడడమే నా కల

**జై కొట్టిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు**

కండువా కప్పి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత

అదే బాటలో మరో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య

టచ్ లో పలువురు మాజీ ఎమ్మెల్యేలు.. మాజీ ఎంపీలు

**హైదరాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గానికి చెందిన మాజీ శాసనసభ్యుడు రాథోడ్ బాపూరావు ఆదివారం అధికారికంగా తెలంగాణ జాగృతిలో చేరారు. సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు స్వయంగా కండువా కప్పి సాదరంగా

మిగతా 2లో

# కేసీఆర్ వర్సెస్ రేవంత్

## జగిత్యాల గడ్డపై కేసీఆర్.. మేడిగడ్డపై సీఎం రేవంత్ గేర్

## సభలతో సమరం.. రైతు భరోసాతో రెడీ.. సమ్మర్ లో పొలిటికల్ హీట్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయ రంగస్థలంపై నేడు ఒక అరుదైన ఉత్కంఠభరితమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. వేసవి భానుడి భగభగలను మించి జగిత్యాల గడ్డపై రాజకీయ సెగలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు పదేళ్లపాటు అప్రతిహతంగా రాష్ట్రాన్ని శాసించి, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన ధీశాలిగా తనదైన ముద్ర వేసిన గులాబీ దళపతి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మరోవైపు ప్రజా తీర్పుతో గద్దెనెక్కి 'మార్పు' నినాదంతో పాలనలో కొత్త ఒరవడి సృష్టిస్తున్న ధీరశాలి రేవంత్ రెడ్డి. ఈ ఇద్దరు మహాయోధుల మధ్య చాలా కాలం రత్వాత ఒకే రోజు మాటల యుద్ధం జరగనుంది. జీవన్ రెడ్డి చేరిక, పార్లమెంట్ సాక్షిగా తేజస్వీ వ్యాఖ్యలు, డీలిమిటేషన్ తో ఎన్డీఏ భంగపాటుకు గురైన సందర్భాల్లో కేసీఆర్ రియాక్షన్ కోసం తెలంగాణ అంతా ఎదురు చూస్తోంది. జగిత్యాల సాక్షిగా నేడు జరగబోతున్న సమర సభ రాష్ట్రంలో ఇప్పటికే చర్చగా మారింది. దశాబ్ద కాలం పాటు ఎదురులేని నేతగా వెలిగిన కేసీఆర్, ఇప్పుడు ప్రజాక్షేత్రంలో గళమెత్తి తన అస్తిత్వాన్ని, తన పార్టీ ఉనికిని చాటుకోవాలని చూస్తున్నారు.

మిగతా 2లో

### కౌంటర్ రెడీ

*కేసీఆర్ విమర్శలను కౌంటర్ చేయాలంటే.. రేవంత్ ను మించిన వారు లేరు. అనేక హంగులున్నా కౌంటర్ చేయడంలో వెనుకబడే అనేకమంది నేతలు పొలిటికల్ ఎన్ కౌంటర్ అయ్యారు. కేసీఆర్ లేవనెత్తే అంశాలు, సీఎం రేవంత్ కౌంటర్.. రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి కాక పుట్టించే అవకాశముంది. కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఈ వారంలోనే పార్టీ పెడుతుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. జగిత్యాల వేదికగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు బీఆర్ఎస్ లో చేరుతుండడం ఇబ్బందికర పరిణామం కాగా, అదేప్రాంతంలో రేవంత్ కూడా అదే రోజు సభ పెట్టడం వ్యూహాత్మకంగా భావిస్తున్నారు.*



## ఏఎన్ఎన్ ఛానల్ మహా పత్రిక ఆధ్వర్యంలో మోడల్ ఈఏప్ సెట్ .. మోడల్ నీట్ పరీక్ష

**ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరీక్షకు 1500 మంది విద్యార్థులు హాజరు**

మోడల్ గ్రాండ్ టెస్ట్ సూపర్ సక్సెస్.. 18 కేంద్రాల్లో పరీక్షలు రాసిన విద్యార్థులు



**ఖమ్మం, మహా :** ఏఎన్ఎన్ ఛానల్ మహా తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థుల కోసం ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మోడల్ ఈప్ సెట్ మోడల్ నీట్ పరీక్ష విజయవంతంగా జరిగింది. ఎంతో పకడ్బందీగా రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్స్ తో ప్రశ్నాపత్రం తయారుచేయించి.. ఈ పరీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఏఎన్ఎన్ ఛానల్ విజ్ఞప్తి మేరకు పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రాండ్ టెస్ట్ జయప్రదానికి సహరించాయి. 18 కేంద్రాలలో 1500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, విద్యార్థులకు పరీక్ష అయిన మరుక్షణమే కీ పేపరు విడుదల చేశారు. కొద్ది రోజుల్లోనే ఫలితాలు ప్రకటించి విజేతలకు జిల్లాస్థాయిలో భారీ ఎత్తున ఈవెంట్ కార్యక్రమం నిర్వహించి నగదు బహుమతి అందిస్తామని ఏఎన్ఎన్ తెలుగు ఖమ్మం టీమ్ ప్రకటించింది. జిల్లాలో ప్రధాన కేంద్రాలలో ప్రశ్నాపత్రం ఆవిష్కరణ కార్యక్రమానికి పలువురు ముఖ్యఅతిథిగా హాజరై మోడల్ ఈప్సెట్ నీట్ పరీక్ష నిర్వహణ తీరు ను అభినందించారు. ఖమ్మం ఎక్సలెంట్ కాలేజ్ ,డాక్టర్స్ మెడికల్ అకాడమీ, న్యూ విజన్, హార్వెస్ట్, కృష్ణవేణి, ప్రజ్ఞ సంస్థలలో పరీక్ష పేపర్లు పలువురు ఆవిష్కరించి అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రవేట్ కళాశాల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జిల్లా శేషగిరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలిసారి నిర్వహించినా ప్రశ్నాపత్రం స్టాండర్డ్ బాగుందని, విద్యార్థులకు అసలు పరీక్ష రాసేముందు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎఎన్ఎన్ ఖమ్మం బ్యూరో ఇన్ ఛార్జి ఉపేందర్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్ నిర్వహణకు శ్రమించి విజయవంతంగా చేయగా, పరీక్ష నిర్వహణలో వరంగల్ బ్యూరో ఇన్ ఛార్జి మౌనిష్ కూడా పాల్గొన్నారు. పరీక్ష విజయవంతానికి సహకరించిన తల్లిదండ్రులకు విద్యార్థులకు యాజమాన్యాలకు ఏ ఎన్ ఎన్ ఛానల్, మహాపత్రికల సీఈవో కంది రామ చంద్రారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.






## తమిళనాడులో ఘోర విషాదం..

**బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు..**

**18 మంది సజీవదహనం.. మరో 9 మంది పరిస్థితి విషమం**



**చెన్నై , మహా:** తమిళనాడు రాష్ట్రాన్ని భారీ పేలుడు తీవ్రంగా కుదిపేసింది. విరుదునగర్ జిల్లాలో ఉన్న ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అత్యంత ఘోర ప్రమాదంలో 18 మంది అమాయక కార్మికులు సజీవదహనమయ్యారు. పండుగ పూట వెలుగులు పంచాల్సిన బాణసంచా.. ఆ కార్మికుల ఇళ్లలో తీరని విషాదపు చీకట్లు నింపింది. అకస్మాత్తుగా సంభవించిన ఈ భారీ పేలుడు ధాటికి ఫ్యాక్టరీ భవనం పూర్తిగా ధ్వంసమై నేలమట్టమైంది. ప్రమాద స్థలంలో ఒక్కసారిగా ఎగసిపడిన భారీ మంటలు, దట్టమైన పొగలు చూసి స్థానికులు ప్రాణభయంతో పరుగులు తీశారు.

మిగతా 2లో

## గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- విద్యాసంస్థల్లో డ్రగ్స్ మహమ్మారికి చెక్
- జూన్ 12న ఎల్బీ స్టేడియంలో భారీ అవగాహన సదస్సు
- నామినేటెడ్ ఎమ్మెల్సీలపైనా చర్చ



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యంగా విద్యాసంస్థల్లో యువత మత్తు బారిన పడకుండా రక్షించేందుకు కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో మర్యాదపూర్వకంగా భేటీ అయి విద్యా రంగంలో నెలకొన్న పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

మిగతా 2లో

## ఉద్యమ స్ఫూర్తిని రగల్చాలి

- కేసీఆర్ ఆమరణ దీక్షకు సాక్ష్యమైన గడ్డ నుంచే పోరుబాట
- మినీ ప్లీనరీలో హరీశ్ రావు పిలుపు
- ఘనంగా పువ్వాడ అజయ్ జన్మదిన వేడుకలు

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా వేదికగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శ్రేణులు సమరశంఖం పూరించాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా మినీ ప్లీనరీ సమావేశం నాయకులు, కార్యకర్తల నడుమ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కీలక సమావేశానికి మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో



## నిమ్మకాయ మంత్రం.. అందుకే చెన్నై ఓడిందబ్బా..

ఆటగాళ్లు లయ తప్పారంటూ సీఎస్‌కే పేరుతో ఫేక్ లేఖ వైరల్

వివరాలు 2లో

# కేసీఆర్ వర్సెస్ రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో గత కొన్ని నెలలుగా స్తబ్దంగా ఉన్న రాజకీయ వాతావరణం, ఒక్కసారిగా వేడెక్కింది. అధికారం కోల్పోయిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వస్తున్న కేసీఆర్, తన రాజకీయ చతురతను, వాగ్ధాటిని మరోసారి ప్రదర్శించనున్నారు. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన కేసీఆర్, ఇప్పుడు ప్రతిపక్ష నేతగా ప్రజల ముందుకు రావడం ఒక విశేషం. ఆయన ప్రసంగం కోసం కేడర్ మాత్రమే కాదు, సామాన్య ప్రజానీకం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలోని లోపాలు, మరియు రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన ఎలాంటి విశ్లేషణ చేస్తారనేది ఉత్కంఠ రేపుతోంది. జగిత్యాల సభ ద్వారా తన ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

**ముఖ్యమంత్రి మేడిగడ్డతో రెడీ**

కేసీఆర్ గర్జనకు ధీటుగా సమాధానం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని, ధరణి నుంచి కాళేశ్వరం వరకు ప్రతి అంశాన్ని ఆయన ప్రజల ముందు పెడుతున్నారు. "మేము చేస్తున్నది అభివృద్ధి.. మీరు చేసింది విధ్వంసం" అనే నినాదంతో రేవంత్ రెడ్డి దూసుకుపోతున్నారు. కేసీఆర్ చేసే ప్రతి విమర్శకు అదే స్థాయిలో కౌంటర్ ఇవ్వడానికి, హైదరాబాద్ నుంచే తన బృందాన్ని సమాయత్తం చేశారు. ముఖ్యంగా యువతను, మహిళలను ఆకట్టుకునేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ, కేసీఆర్ ఇమేజ్‌ను ప్రజల్లో తగ్గించే ప్రయత్నం రేవంత్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి దూకుడు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది.

**కాళేశ్వర స్వామి దర్శనంతో ...**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సాగనుంది. సోమవారం మధ్యాహ్నం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్న సీఎం , కాళేశ్వరం ఆలయ అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మేడిగడ్డకు చేరుకోనున్న ముఖ్యమంత్రి మేడిగడ్డ డ్యామ్ సైట్ ను పరిశీలించనున్నారు. అక్కడే ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి మీడియాతో మాట్లాడనున్న సీఎం అక్కడి నుంచి నేరుగా కాటారం మండలం నస్తురపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకోనున్నారు.

# పవన్‌కు మోదీ ఫోన్

## త్వరగా కోలుకోవాలన్న జగన్ .. ధన్యవాదాలు తెలిపిన జనసేనాని

**హైదరాబాద్, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "పవన్ కల్యాణ్ గారితో మాట్లాడాను. ఆయన చాలా ధైర్యవంతుడు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రధాని చూపిన ఆప్యాయతకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. మోదీ ఆశీస్సులు, ప్రోత్సాహం తనకు గొప్ప బలాన్ని ఇస్తాయని ఆయన బదులిచ్చారు. ఈ మేరకు పవన్ స్పందిస్తూ.. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారికి ధన్యవాదాలు. సర్జరీ అనంతరం నా ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి సమయం కేటాయించి మాట్లాడినందుకు కృతజ్ఞతలు. నా ఆరోగ్యం పట్ల మీ ఆందోళన, నేను త్వరగా కోలుకోవాలని మీరు తెలిపిన శుభాకాంక్షలు నాకు గొప్ప బలాన్ని ఇస్తున్నాయి. మీ మార్గదర్శకత్వం, మద్దతుకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు.

**జగన్ విషెస్**

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. దీనికి పవన్ స్పందిస్తూ, "నా ఆరోగ్యం, కోలుకోవడం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ. నేను క్రమంగా కోలుకుంటున్నాను. మీ ఆదరణకు కృతజ్ఞుడను" అని బదులిచ్చారు. వీరితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలం తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే విధుల్లో చేరతారని జనసేన వర్గాలు తెలిపాయి.

# చంద్రబాబు @ 76

## బర్త్ డే సీడీపీ విడుదల చేసిన లోకేష్

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు 76వ పుట్టిన రోజు (ఏప్రిల్ 20) సందర్భంగా ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఒక కామన్ డిస్ప్లే పిక్చర్ (సీడీపీ)ని విడుదల చేశారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన తర్వాత లోకేష్ ఈ సీడీపీని ఆవిష్కరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. "మన నాయకుడు ఎన్‌సీబీఎన్ గారి పుట్టినరోజు గౌరవార్థం ఈ సీడీపీని అధికారికంగా విడుదల చేయడం గర్వంగా ఉంది" అని లోకేష్ తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఈ సీడీపీ విడుదలతో టీడీపీ శ్రేణులు, అభిమానులు సోషల్ మీడియాలో తమ ప్రొఫైల్ చిత్రాలను మార్చుకుంటూ చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# తమిళనాడులో ఘోర విషాదం..

(మొదటిపేజీ తరువాయి)

ఈ హృదయ విదారక ఘటనలో ఇప్పటివరకు 18 మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీశారు. మరో 9 మంది కార్మికులు తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. కాలిపోయిన శరీరాలతో ఆసుపత్రి పాలైన వారి రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదచాయలు అలుముకున్నాయి. కాలిన గాయాలు తీవ్రంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వైద్యులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శిథిలాల కింద గాలింపు..**

పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల ప్రాంతాలు భూకంపం వచ్చిన తరహాలో కంపించాయని, భారీ శబ్దంతో భవనం పేకమేడలా కుప్పకూలిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భవనం శిథిలాల కింద ఇంకా ఎవరైనా కార్మికులు చిక్కుకున్నారా అనే కోణంలో అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ఈ పేలుడుకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ఘోరానికి కారణమా, లేక యాజమాన్య తీవ్ర నిర్లక్ష్యం ఉందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలవడానికి కారణమైన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు, స్థానికులు కన్నీరుమున్నీరుగా డిమాండ్ చేస్తున్నారు.



మిస్ ఇండియా విజేతగా

# సాధ్వీ సైల్

- ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని కైవసం చేసుకున్న గోవా బ్యూటీ
- భువనేశ్వర్‌లో అట్టహాసంగా ముగిసిన అందాల పోటీలు
- ఫస్ట్ రన్నరప్‌గా రాజ్‌నందిని పవార్

**భువనేశ్వర్, మహా:** భారతదేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2026' కిరీటాన్ని గోవాకు చెందిన ముద్దుగుమ్మ సాధ్వీ సైల్ సొంతం చేసుకుంది. ఒడిశా రాజధాని భువనేశ్వర్ వేదికగా అత్యంత అట్టహాసంగా జరిగిన ఈ గ్రాండ్ ఫినాలేలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎంతో మంది అందాల భామలతో పోటీపడి సాధ్వీ సైల్ ఈ అరుదైన విజయాన్ని అందుకుంది. తన అద్భుతమైన అందం, అభినయం, మరియు సమయస్ఫూర్తితో న్యాయనిర్ణేతలను మెప్పించిన ఆమె మిస్ ఇండియా కిరీటాన్ని దక్కించుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో మహారాష్ట్రకు ఆకర్షణగా నిలిచిన రాజ్‌నందిని పవార్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా.. కేంద్రపాలిత ప్రాంతాల (కంబైన్డ్) తరఫున ప్రాతినిధ్యం వహించిన శ్రీ అద్వైత సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జరిగిన ఈ అందాల పోటీల గ్రాండ్ ఫినాలే ఆద్యంతం ఆకర్షణీయంగా సాగింది. విజేతగా నిలిచిన సాధ్వీ సైల్‌కు కిరీటాన్ని బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ విజయంతో గోవా రాష్ట్ర ప్రజలు, ఆమె అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. దేశవ్యాప్తంగా ఎంతో మంది యువతులకు ఆదర్శంగా నిలిచిన సాధ్వీ సైల్, భవిష్యత్తులో జరగబోయే అంతర్జాతీయ అందాల పోటీల్లో సైతం భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.



# కార్బైడ్ పండ్ల విక్రయాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా

- వ్యాపారుల గుట్టురట్టు చేసేందుకు మార్కెట్లలో 'స్ట్రిప్ పేపర్ టెస్ట్' అస్త్రం
- రసాయనాలకు బదులుగా ప్రభుత్వ 'రైపనింగ్ ఛాంబర్స్' వాడుకోవాలని సూచన



**హైదరాబాద్, మహా:** వేసవి కాలం రాగానే మార్కెట్లోకి వచ్చే మామిడి పండ్లతో పాటు అరటి, బొప్పాయిల ముసుగులో కృత్రిమంగా పండించిన విషాన్ని ప్రజలకు విక్రయిస్తున్న వ్యాపారుల ఆట కట్టించేందుకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే 'కాల్షియం కార్బైడ్' అనే అత్యంత ప్రమాదకరమైన రసాయనాన్ని ఉపయోగించి పండ్లను ముగ్గబెట్టడాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ పూర్తిగా నిషేధించింది. నిబంధనలను తుంగలో తొక్కి దొడ్డిదారిన లాభాలు ఆర్జించేందుకు కార్బైడ్ వాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని, ఇందుకోసం దేశవ్యాప్తంగా అన్ని పండ్ల మార్కెట్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల ఆహార భద్రతా అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడే వ్యాపారులను పట్టుకునేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులకు 'స్ట్రిప్ పేపర్ టెస్ట్' అనే ఒక సులభమైన సాంకేతికతను సూచించింది. ఈ పరీక్ష ద్వారా పండ్లలో ప్రమాదకరమైన ఎసిటిలీన్ గ్యాస్ ఉందో లేదో ఇట్టే పసిగట్టవచ్చు. తనిఖీల్లో భాగంగా అధికారులు అనుమానం ఉన్న పండ్లను గాలి చొరబడని ఒక కంటైనర్‌లో ఉంచి, అందులో ఒక తడి స్ట్రిప్ పేపర్‌ను ఉంచుతారు. కొద్దిసేపు వేచి చూసిన తర్వాత ఆ పేపర్ రంగు మారితే, ఆ పండ్లను కృత్రిమంగా ముగ్గబెట్టేందుకు కచ్చితంగా కాల్షియం కార్బైడ్ వాడినట్లు అధికారులు శాస్త్రీయంగా నిర్ధారిస్తారు. దొరికిన వెంటనే సదరు డీలర్లు, వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. కార్బైడ్ లాంటి కృత్రిమ రసాయనాలు వాడి ప్రజల ప్రాణాలతో, ఆరోగ్యంతో చెలగాటమాడొద్దని వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. పండ్లను అత్యంత సురక్షితంగా, శాస్త్రీయ పద్ధతిలో ముగ్గబెట్టేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రధాన మార్కెట్లలో ప్రభుత్వం ఇప్పటికే ఆధునిక సాంకేతికతతో కూడిన 'రైపనింగ్ ఛాంబర్స్'ను అందుబాటులోకి తెచ్చింది. వ్యాపారులు, రైతులు ఈ సురక్షితమైన ప్రభుత్వ సదుపాయాలను మాత్రమే ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి రసాయనాలు వాడితే జైలు శిక్ష తప్పదని ప్రభుత్వం హెచ్చరిస్తోంది. మరోవైపు పండ్ల కొనుగోలు సమయంలో వినియోగదారులు సైతం అప్రమత్తంగా ఉండి, సహజంగా పండిన పండ్లను మాత్రమే ఎంచుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

# మనుషులను ఓడించిన చైనా రోబోలు

## హాఫ్ మారథాన్‌లో సంచలనం

**మహా:** రోబోటిక్స్ టెక్నాలజీలో చైనా సరికొత్త సంచలనం సృష్టించింది. బీజింగ్‌లో జరిగిన ఓ హాఫ్ మారథాన్‌లో హ్యూమనాయిడ్ రోబోలు మానవ అథ్లెట్లను మించిన వేగంతో పరుగెత్తి, ఏకంగా ప్రపంచ రికార్డును సైతం బద్దలు కొట్టాయి. ఈ అద్భుత ప్రదర్శన, రోబో సాంకేతికతలో జరుగుతున్న వేగవంతమైన పురోగతికి నిదర్శనంగా నిలిచింది. బీజింగ్ ఈటౌన్ వేదికగా జరిగిన ఈ హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్‌లో 12,000 మంది మానవ రన్నర్లతో పాటు చైనాలో తయారైన వందలాది హ్యూమనాయిడ్ రోబోలు పోటీపడ్డాయి. భద్రతా కారణాల రీత్యా మనుషులు, రోబోలకు వేర్వేరు ట్రాక్‌లపై ఈ 21 కిలోమీటర్ల రేసును నిర్వహించారు. గతేడాది జరిగిన మొదటి ఈవెంట్‌లో చాలా రోబోలు కనీసం రేసును పూర్తి చేయలేకపోయాయి. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 100కి పైగా రోబో బృందాలు పాల్గొనగా, వాటిలో సగానికి పైగా ఎలాంటి రిమోట్ కంట్రోల్ సాయం లేకుండానే స్వయంప్రతిపత్తంగా గమ్యాన్ని చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి.



# కవితక్కను సీఎంగా చూడడమే నా కల

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాపూరావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజలందరికీ మంచి రోజులు వస్తాయన్న ఉద్దేశంతోనే నాడు తాను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ బోథ్ నియోజకవర్గంలో ప్రజాసేవకు అంకితమయ్యానని రాథోడ్ బాపూరావు గుర్తు చేసుకున్నారు. దట్టమైన అడవులున్న ఆదిలాబాద్ జిల్లాలో కల్వకుంట్ల కవిత నాడు స్వయంగా వారం రోజుల పాటు బస చేసి మెడికల్ క్యాంపు నిర్వహించడం తనను ఎంతగానో ఆకర్షించిందని ఆయన తెలిపారు. కవిత అండగా ఉన్నారన్న అపారమైన ధైర్యంతోనే తాను ఉద్యోగాన్ని సైతం వదులుకుని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని ఆయన స్పష్టం చేశారు. బోథ్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తనకు పార్టీలో సరైన గుర్తింపు దక్కలేదని, మధ్యలో వచ్చిన వారు ఏకంగా మంత్రులు అయిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తనకు ముచ్చటగా మూడవసారి టికెట్ నిరాకరించారని తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు. సొంత పార్టీలో ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, అక్కడ కూడా తనకు తగిన ప్రాధాన్యత దక్కలేదని రాథోడ్ బాపూరావు కుండబద్దలు కొట్టారు. అందుకే కల్వకుంట్ల కవిత నాయకత్వంలో త్వరలో ఏర్పాటు కాబోతున్న నూతన రాజకీయ పార్టీలో తాను క్రియాశీలక పాత్ర పోషించబోతున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి కల్వకుంట్ల కవిత మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త పార్టీ ప్రకటన వెలువడిన వెంటనే ఇచ్చోడ వేదికగా ఒక అత్యంత భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి, వేలాది మంది కార్యకర్తలను పార్టీలో జాయిన్ చేయిస్తానని బాపూరావు స్పష్టం చేశారు.

**అదే బాటలో..**

కవిత బాటలోనే ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్మన్ చందాలింగయ్య కూడా కవిత పార్టీలో చేరే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. కవిత పార్టీలో చేరేందుకు అనేకమంది మాజీ ఎమ్మెల్యేలు ఉత్సాహం ప్రదర్శిస్తుండగా, 25వ తేదీ నాటికి ఎంతమంది చేరుతారో తర్వాత ఎంతమంది చేరుతారో చూడాల్సి ఉంది. కొందరు చేరేందుకు ముందుకువచ్చినా తమ జాతకం ప్రకారం ముహూర్తాలు చూసుకుంటున్నట్లు తెలిసింది. కవిత పార్టీ ఆషామాషీగా ఉండదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఉద్యమ స్ఫూర్తిని రగల్చాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ, ఆ పార్టీని రాజకీయంగా మట్టికరిపించేందుకు నాయకులంతా భేదాభిప్రాయాలు విడనాడి ఒక్కతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఖమ్మం జిల్లాకు ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను హరీశ్ రావు ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమ ఘట్టంలో పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్షకు ఖమ్మం జిల్లానే సజీవ సాక్ష్యంగా నిలిచిందని ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇక్కడి నుంచే ఏ రకమైన ఉద్యమ స్ఫూర్తి రగిలిందో, నేడు సరిగ్గా అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై పోరాడాలని ఆయన కార్యకర్తలకు ఉద్బోధించారు. తెలంగాణకు గుమ్మం అయిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకత్వం అంతా ఏకతాటిపైకొచ్చి అధికార పార్టీపై రాజీలేని పోరాటం చేస్తామని ఈ ప్లీనరీ వేదికగా ప్రతినబూనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇదే వేదికపై రాజకీయ తీర్మానాలతో పాటు పండుగ వాతావరణం సైతం నెలకొంది. మినీ ప్లీనరీ రోజే మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పుట్టినరోజు కావడంతో వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి హరీశ్ రావుతో సహా పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పువ్వాడ అజయ్‌కు ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిమ్మకాయ మంత్రం..అందుకే చెన్నై ఓడిందబ్బా..

## ఆటగాళ్లు లయ తప్పారంటూ సీఎస్‌కే పేరుతో ఫేక్ లేఖ వైరల్



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ అభిమాని చేతబడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ.. సీఎస్‌కే యాజమాన్యం పేరుతో ఫేక్ లెటర్ క్రియేట్ చేసి బీసీసీఐకి ఫిర్యాదుచేసినట్లు వైరల్ చేశారు. నిమ్మకాయ మంత్రమూ.. లెటరూ.. రెండు ఫేకే. కానీ ఫన్నీ వీడియో మాత్రం ఇంటర్ నెట్ ను షేక్ చేస్తోంది.

**స్టేడియంలో నిమ్మకాయలు.. మంత్రాల కలకలం**

ఏప్రిల్ 18, 2026న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా ఎస్ఆర్‌హెచ్, సీఎస్‌కే జట్ల మధ్య హోరాహోరీ సమరం జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో స్టాండ్స్‌లో కూర్చున్న కొందరు ప్రేక్షకులు, ముఖ్యంగా ఒక ఎస్ఆర్‌హెచ్ అభిమాని నిమ్మకాయలు చేతబట్టి వింత వింతగా మంత్రాలు చదువుతూ క్షుద్ర పూజలు (బ్లాక్ మ్యాజిక్) చేశాడని సీఎస్‌కే యాజమాన్యం పేరుతో ఓ ఫేక్ లెటర్ క్రియేట్ చేశారు. కాగా ప్రేక్షకుల క్రియేటివిటీ చూసి యాజమాన్యాలు, ఆటగాళ్ళు షాకవుతున్నారు.

# బెంగాల్‌లో మరమరాలు కొన్న మోదీ

## ఝూర్‌గ్రామ్‌లో సామాన్యుడిలా స్థానిక రుచుల ఆస్వాదన..



**మహా నెట్ వర్క్:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికల ప్రచార హోరు తారాస్థాయికి చేరుకుంది. ఉక్కిరిబిక్కిరి చేసే అత్యంత బిజీ షెడ్యూల్ మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాణాల మధ్యలో ఓ మరమరాలు, పల్లీల దుకాణానికి వెళ్ళి మరమరాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలు, కాస్త ఘాటైన మసాలా కలిపి తయారు చేసే ఈ రుచికరమైన చిరుతిండిని ప్రధాని సాధారణ పౌరుడిలా ఆస్వాదించిన తీరు స్థానికులను ఆకట్టుకుంది. ఈ ఆహ్లాదకరమైన క్షణాలకు సంబంధించిన ఫోటోను ప్రధాని మోదీ స్వయంగా తన సోషల్ మీడియా (ఎక్స్) ఖాతాలో పంచుకున్నారు. "ఆదివారం పశ్చిమ బెంగాల్‌లో వరుసగా నాలుగు ర్యాలీల మధ్య.. ఝూర్‌గ్రామ్‌లో రుచికరమైన ఝల్ మురిని ఆస్వాదించాను" అంటూ ఆయన చేసిన పోస్ట్ ఇప్పుడు అంతర్జాలంలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఒకవైపు పదునైన విమర్శలతో రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే, మరోవైపు ఇలా స్థానిక సంస్కృతి, రుచులతో మమేకమవుతూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

## నిప్పులు చెరిగిన ప్రధాని.. మహిళల పట్ల టీఎంసీ కుట్రలు



చిరుతిండి విరామం అనంతరం రాజకీయ ప్రచారంలోకి దిగిన ప్రధాని మోదీ, అధికార తృణమూల్ కాంగ్రెస్ , ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లక్ష్యంగా నిప్పులు చెరిగారు. బంకురాలో నిర్వహించిన భారీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. బెంగాల్ మహిళలను టీఎంసీ మరోసారి దారుణంగా వంచించిందని దుయ్యబట్టారు. చట్టసభల్లో తమకు దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్లు రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల నాటికే అమల్లోకి రావాలని రాష్ట్ర మహిళలు బలంగా ఆకాంక్షించారని ఆయన గుర్తుచేశారు. కానీ, ఆ ప్రతిష్టాత్మక మహిళా రిజర్వేషన్ల బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి టీఎంసీ కుటిల ప్రయత్నాలు చేసిందని ఆయన మండిపడ్డారు. బెంగాల్ ఆడబిడ్డలు పెద్ద సంఖ్యలో చట్టసభలకు ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపీలుగా రాణించడం టీఎంసీ అధినాయకత్వానికి ఏమాత్రం ఇష్టం లేదని ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళా సాధికారతకు అడ్డుపడుతూ, వారి అవకాశాలకు గండికొడుతున్న ఇలాంటి పార్టీకి రాబోయే ఎన్నికల్లో 'ఓటు' అనే ప్రజాస్వామ్య ఆయుధంతో గట్టి శిక్ష వేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని మోదీ రాష్ట్ర ప్రజలకు దిశానిర్దేశం చేశారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాల సమయంలోనే విద్యార్థుల నుంచి 'డ్రగ్స్ కు ఎల్లప్పుడూ దూరంగా ఉంటాం' అని కచ్చితమైన ప్రమాణపత్రం తీసుకునేలా నూతన విధానాన్ని తీసుకురావాలని ఈ అత్యున్నత స్థాయి భేటీలో నిర్ణయించారు. రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కీలక భేటీలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి సైతం పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యా రంగానికి సంబంధించి నెలకొన్న తాజా పరిస్థితులు, విద్యా వ్యవస్థ ప్రక్షాళన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలపై గవర్నర్‌కు ముఖ్యమంత్రి సవివరంగా వివరించారు. ముఖ్యంగా వచ్చే జూన్ 12వ తేదీన నగర నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించతలపెట్టిన ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమంపై నేతలు ప్రధానంగా మంతనాలు జరిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఒక బలమైన, స్పష్టమైన సందేశాన్ని పంపాలని సర్కారు యోచిస్తోంది.

**నామినేటెడ్ ఎమ్మెల్సీలపైనా చర్చ**

ప్రొఫెసర్ కోదండరాం, అజరుద్దీన్ లకు నామినేటెడ్ ఎమ్మెల్సీల అంశం పెండింగ్ లో ఉందని, దీనిపై నిర్ణయం తీసుకోవాలని గవర్నర్ ను సీఎం రేవంత్ రెడ్డి కోరినట్లు సమాచారం. ఈనెల 30 లోగా అజరుద్దీన్ ఏదో ఒక చట్టసభలో సభ్యుడు కావాల్సి ఉండగా, నామినేటెడ్ ఎమ్మెల్సీలపై ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. నామినేటెడ్ ఎమ్మెల్సీలకు లైన్ క్లియర్ అయ్యే అవకాశాలు కనబడుతున్నాయి.





ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్
20-04-2026

మహా స్పెషల్



# ప్రత్తిపాడు గుండెల్లో చెరగని రాజన్న సంతకం

## రాజన్న ఆశయం సత్యప్రభమ్మే ప్రగతి నిశ్చయం.. సేవే శ్వాసగా అప్రతిహత ప్రగతి రథసారథి

### నిరుపేదల పెన్నిధి రాజన్న సేవా వారసత్వం.. కన్నీటి నివాళి చారిత్రాత్మక విజయ విప్లవం.. ప్రజా క్షేత్రంలో సత్యప్రభమ్మ ప్రగతి శంఖారావం

(మహా ప్రత్యేకం)

**కాకినాడ , మహా:** **రాజకీయం అంటే కేవలం అధికార పీఠం కోసం సాగించే చదరంగం కాదు, అది ఆకలితో అలమటించే నిరుపేద గుండెల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఒక నిరంతర యజ్ఞం అని తన రక్తంతో లిఖించిన ధృవతార స్వర్గీయ వరుపుల రాజా. ప్రత్తిపాడు నియోజకవర్గ మట్టిలో, ప్రతి మనిషి శ్వాసలో రాజన్న పేరు ఒక అనురాగ మంత్రమై ప్రతిధ్వనిస్తోంది. అధికార గర్వం తెలియని ఆ అరుదైన ప్రజా నాయకుడు, పంజా విసిరిన ప్రత్యర్థుల కుట్రలను తన చిరునవ్వుతోనే చిత్తు చేసిన ధీశాలి. పదవి ఉన్నా లేకున్నా నియోజకవర్గమే తన ఇల్లుగా, ప్రజలే తన ప్రాణంగా బతికిన ఆ మహనీయుడు భౌతికంగా నిష్క్రమించినా, ఆయన వదిలి వెళ్ళిన సేవా వారసత్వం నేడు ఒక అప్రతిహత ప్రభంజనంలా ప్రత్తిపాడు గడ్డను చుట్టేస్తోంది. రాజన్న అంటే కేవలం ఒక పేరు కాదు, అది ఒక ఆపద్బాంధవుడి భరోసా.

విధి వెక్కిరించి, నియోజకవర్గ ఆశాజ్యోతి అర్థాంతరంగా ఆరిపోయినప్పుడు, ఆ సేవా సామ్రాజ్యం కూలిపోయిందని కుట్రదారులు పగటి కలలు కన్నారు. కానీ, తన భర్త చితి నుంచి ఎగసిన నిప్పుకణికలా, నియోజకవర్గ ప్రజల కన్నీటిని ఆయుధంగా మార్చుకుని రణరంగంలోకి దూకిన వీరనారి శ్రీమతి వరుపుల సత్యప్రభ. 2024 ఎన్నికల సమరంలో ఆమె నమోదు చేసిన చారిత్రక విజయం ఒక సాధారణ రాజకీయ గెలుపు కాదు; అది రాజన్నను వేధించిన శక్తులపై ప్రజలు కురిపించిన ఆగ్రహాగ్ని, తమ ప్రియతమ నాయకుడికి సమర్పించిన అశ్రు నివాళి. గృహిణి స్థాయి నుండి గర్జించే ప్రజా సారథిగా ఆమె ఎదిగిన తీరు, ప్రత్తిపాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన విప్లవానికి నాంది పలికింది. నేడు సత్యప్రభమ్మ అడుగులో రాజన్న ధైర్యం కనిపిస్తోంది, ఆమె మాటలో ప్రజా సంక్షేమ నినాదం వినిపిస్తోంది. నేడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో వెల్లివిరుస్తున్నది స్వచ్ఛమైన, నిఖార్సయిన అభివృద్ధి పాలన. మారుమూల గిరిజన పల్లెల నుండి మైదాన ప్రాంతాల వరకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందుతుండటం రాజన్న కలల సాకారానికి నిదర్శనం. అవినీతి రాబందుల గుండెల్లో నిద్రపోతూ, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సత్యప్రభమ్మ సాగిస్తున్న ఈ ప్రస్థానం రాష్ట్ర రాజకీయాలకే ఒక సరికొత్త దిక్సూచి. రాజన్న ప్రారంభించిన సేవా యజ్ఞాన్ని తన రెండు భుజాలపై మోస్తూ, నిరుపేదల కళ్లలో వెలుగులు నింపుతున్న ఆమె పాలన చూసి ప్రత్యర్థులు సైతం విస్తుపోతున్నారు. ఇది కేవలం అధికారం కాదు, రాజన్న ఆశయాల సజీవ సాక్ష్యం. ప్రత్తిపాడు ప్రగతి రథంపై సత్యప్రభమ్మ సారథ్యంలో రాజన్న వారసత్వం సువర్ణాక్షరాలతో లిఖించబడుతోంది. తాజాగా తెలుగురాష్ట్రాల్లో ప్రత్యేకత సంపాదించుకున్న వరుపుల రాజా సేవలను ఎఎన్ఎన్ మహా అవార్డ్స్ ద్వారా గౌరవించింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ పాల్గొన్న కార్యక్రమంలో, హైదరాబాద్ నడిబొడ్డున రాజా సేవలను స్మరించే వీడియోను ప్రదర్శించడంతో పాటు లైఫ్ టైమ్ సర్వీస్ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రధానం చేసింది.

### ప్రత్తిపాడు నియోజకవర్గ ఆశాజ్యోతి రాజన్న ఆశయాల ప్రస్థానం

రాజకీయాలు అంటే కేవలం అధికార దర్పం మాత్రమే కాదని, అది అట్టడుగు వర్గాల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకోవడమేనని నిరూపించిన అరుదైన ప్రజాసేవకుడు స్వర్గీయ వరుపుల జోగిరాజు (రాజా). పదవులు ఉన్నా లేకున్నా నిరంతర ప్రజాసేవే పరమావధిగా జీవించిన ఆయన, భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజల మదిలో ఆరని జ్యోతిలా వెలుగుతూనే ఉన్నారు. గిరిజన గూడాల నుంచి మైదాన ప్రాంతాల వరకు ప్రతి ఇంటా ఆయన పేరు ఒక ఆత్మీయ పలకరింపుగా మారిపోయింది. ఆ మహానేత అర్థాంతరంగా తనువు చాలించినా, ఆయన ఉన్నతమైన ఆశయాలకు ఊపిరి పోస్తూ, ప్రత్తిపాడు ప్రగతి రథసారథిగా సగర్వంగా బాధ్యతలు చేపట్టారు ఆయన సతీమణి, ప్రస్తుత శాసన సభ్యురాలు శ్రీమతి వరుపుల సత్యప్రభ.

### సేవా గుణమే పునాదిగా రాజకీయ వారసత్వ జననం

కాకినాడ జిల్లా పెదశంకర్లపూడి గ్రామంలో 1975 ఆగస్టు 14వ తేదీన వరుపుల తమ్మారావు దంపతులకు జన్మించిన రాజన్నకు సేవ అనేది పుట్టుకతోనే అబ్బింది. వారిది అత్యంత బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న భూస్వామ్య కుటుంబం కావడంతో, ప్రజా సమస్యలపై చిన్నతనం నుంచే ఆయనకు లోతైన అవగాహన ఉండేది. ఆయన తాతగారైన వరుపుల జోగిరాజు గతంలో ఎమ్మెల్యేగా పనిచేసి నియోజకవర్గానికి ఎనలేని సేవలు అందించారు. ఆ రాజకీయ వారసత్వాన్ని, నిస్వార్థ సేవా గుణాన్ని పుణికిపుచ్చుకున్న రాజా గారు, వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రుడై ఆర్థికంగా స్థిరపడిన వ్యాపారవేత్త అయినా ఏనాడూ ఆడంబరాలకు పోలేదు. సంపద కన్నా సామాన్యుల ప్రేమే గొప్పదని నమ్మిన విశాల హృదయం ఆయనది.



జోగిరాజు.. అలియాస్... రాజా

### అంచెలంచెలుగా ఎదిగిన రాజకీయ నాయకత్వ పటిమ

కేవలం ఆస్తులు, అంతస్తులు చూసుకుని మురిసిపోయే స్వభావం లేని రాజా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం 2003లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2005లో ఎంపీటీసీగా అఖండ విజయం సాధించి, ఆ వెంటనే ప్రత్తిపాడు ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి తనదైన ముద్ర వేశారు. ఆ తర్వాత 2012లో తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ ఛైర్మన్‌గా, రాష్ట్ర స్థాయి అప్కాబ్ వైస్ ఛైర్మన్‌గా అత్యున్నత పదవులు అలంకరించి సహకార రంగాన్ని బలోపేతం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. శత్రువును సైతం చిరునవ్వుతో పలకరించే ఆయన కల్మషం లేని తత్వం పార్టీలకతీతంగా వేలాది మంది అభిమానులను సంపాదించి పెట్టింది.

### పరాజయంలోనూ చెదరని ప్రజాసేవా దృక్పథం

2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాజా గారు కేవలం అతి స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అయినప్పటికీ ఈ ఓటమి ఆయన సేవా దృక్పథాన్ని ఏమాత్రం అడ్డుకోలేకపోయింది. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాడుతున్న క్రమంలో అధికార పక్షం నుంచి ఎదురైన రాజకీయ కక్ష సాధింపులు, అసత్య విమర్శలు ఆయన మానసిక ధైర్యాన్ని పరీక్షించాయి. అక్రమ కేసులు, వేధింపులు ఉన్నా భయపడకుండా ప్రజల కోసమే నిలబడ్డారు. పరాజయం పాలైన తర్వాత కూడా నియోజకవర్గాన్ని వీడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించిన అరుదైన నేత ఆయన.

### తీరని లోటుగా మిగిలిన మహానేత ఆకస్మిక నిష్క్రమణ

అనేక రాజకీయ ఒత్తిడులు, కష్టాల మధ్యే ప్రజల కోసం పనిచేస్తున్న రాజన్న కేవలం 46 ఏళ్ల చిన్న వయసులోనే 2023 మార్చి 4వ తేదీన గుండెపోటుతో అర్థాంతరంగా కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మరణం యావత్ ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని కోలుకోలేని శోకసంద్రంలో ముంచేసింది. తమ కష్టసుఖాల్లో తోడుండే ఆపద్బాంధవుడు ఇక లేడన్న నిజాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. నియోజకవర్గంలోని ప్రతి ఇల్లూ ఒక గూడు చెదిరిన పక్షిలా విలపించింది. రాజకీయాల్లో ఒక గొప్ప సేవాశీలిని కోల్పోయిన ప్రత్తిపాడు గడ్డ తన ప్రియతమ నేతకు కన్నీటి నివాళులు అర్పించింది.

### ప్రగతి పథంలో ప్రత్తిపాడు నూతన పాలనా విప్లవం

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే సత్యప్రభ తన భర్త ఆశయ సాధనే ఏకైక లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నారు. ఏ దశాబ్దంలోనూ ఏ నాయకుడూ కన్నెత్తి చూడని అత్యంత మారుమూల గిరిజన గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో నడిపిస్తూ, వారి ఆకలి తీర్చాలన్న రాజన్న కలను ఆమె సాకారం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి కేటాయించిన నిధులను పూర్తి పారదర్శకతతో ఖర్చు చేస్తూ, అవినీతికి ఏమాత్రం తావులేకుండా నిఖార్సయిన అభివృద్ధిని అందిస్తున్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా రాజకీయ ప్రత్యర్థులను సైతం ఆప్యాయంగా కలుపుకుపోతూ ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తున్నారు.

### కన్నీటి నడక నుంచి ధైర్యంగా అడుగులు వేసిన సత్యప్రభ

తమ కుటుంబ పెద్దను కోల్పోయిన బాధ నుంచి కోలుకోవడం ఆ కుటుంబానికే కాదు, ప్రజలకూ పెను సవాలుగా మారింది. అయితే తన భర్త అర్థాంతరంగా వదిలేసిన ఆశయాలను, ఆయన కన్న కలలను నెరవేర్చాలన్న తపనతో సత్యప్రభ గారు ముందుకు వచ్చారు. రాజా గారు చేసిన అపారమైన సేవలను, ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలను గుర్తించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు గారు, 2024 ఎన్నికల్లో సత్యప్రభ గారికి ప్రత్తిపాడు అసెంబ్లీ టికెట్ కేటాయించారు. తమ ఆరాధ్య దైవం రాజాపై ఉన్న అపారమైన ప్రేమను ప్రజలు చారిత్రాత్మక మెజారిటీగా మార్చి సత్యప్రభను అత్యున్నత చట్టసభకు పంపారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా దినచర్య

నియోజకవర్గంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి వంటి కనీస సౌకర్యాలకు లోటు రాకూడదన్న రాజన్న లక్ష్యమే నేడు సత్యప్రభ గారి రోజువారీ శాసనంగా మారింది. కార్యకర్తలకు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి కష్టాలను ఆలకించడంలో ఆమె తన భర్త వారసత్వాన్ని అక్షరాలా పుణికిపుచ్చుకున్నారు. ప్రత్తిపాడు అడ్మినిస్ట్రేషన్ నేడు రాష్ట్రంలోనే ఒక నమూనాగా మారుతోంది. కేవలం పదవుల కోసం కాకుండా బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆమె తీరు ప్రజల్లో మరింత గౌరవాన్ని పెంచుతోంది.

### చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో వరుపుల దంపతుల పేరు

ప్రత్తిపాడు రాజకీయ చరిత్రలో వరుపుల రాజా, సత్యప్రభ దంపతుల పేరు వారి సేవాతత్పరత కారణంగా ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. వక్రించిన రాజకీయ వ్యవస్థకు ప్రత్తిపాడు అడ్మినిస్ట్రేషన్ ఒక సరికొత్త దిక్సూచిగా నిలుస్తోంది. రాజన్న ఆశయాలను భుజానికెత్తుకుని ప్రగతి రథాన్ని ముందుకు నడిపిస్తున్న సత్యప్రభ గారి నాయకత్వం నియోజకవర్గానికి కొండంత అండగా మారింది. రాబోయే రోజుల్లో ప్రత్తిపాడు అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను అందుకుంటుందని, రాజన్న ఆశీస్సులు నియోజకవర్గంపై ఎప్పుడూ ఉంటాయని ప్రజలు బలంగా నమ్ముతున్నారు.

### అభాగ్యుల పాలిట కల్పవృక్షం వరుపుల తమ్మారావు ఫౌండేషన్

రాజకీయాల్లో గెలుపోటములు సహజమైనా, ప్రజా సేవలో రాజా ఎప్పుడూ తిరుగులేని విజేతగానే నిలిచారు. తన తండ్రి పేరు మీద 'వరుపుల తమ్మారావు ఫౌండేషన్' స్థాపించి విద్య, వైద్యం ఏ ఒక్క పేదవాడికీ దూరం కాకూడదని సంకల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో లెక్కకు మిక్కిలి మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి వేలాది మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, తన సొంత ఖర్చులతో ఎంతోమందికి అత్యంత ఖరీదైన గుండె ఆపరేషన్లు చేయించి పునర్జన్మ ప్రసాదించారు. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తూ సరస్వతీ పుత్రులకు ఆత్మబంధువుగా మారారు. వృద్ధులకు, వికలాంగులకు సేవ చేస్తూనే యువత కోసం జాబ్ మేళాలు నిర్వహించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.





# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

## రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్(సిఐటియు)నిర్ణయం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆర్టీసీ పరిరక్షణ కార్మికుల సంక్షేమం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం అవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు ప్రజాసంఘాల నాయకులు ఆర్టీసీ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. స్థానిక టీచర్స్ భవన్లో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మందా నరసింహారావు, ఆర్టీసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రీజియన్ నాయకులు యాస నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రైవేటు వ్యక్తుల చేతులకు వెళ్ళనీయకుండా ప్రభుత్వం ఆధీనంలో ఉండే విధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ పరిరక్షణ కోసం ప్రతి కార్మికునీ యొక్క ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని సమ్మెకు సిద్ధం అయ్యేలా కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి నిర్ణయించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సాచివేత ధోరణి సరైంది కాదన్నారు. వేతన సవరణ చేయాలన్నారు. ఆర్టీసీలో నూతన ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలన్నారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ప్రాధాన్యత గుర్తిస్తామని చెప్పిన విషయం కాంగ్రెస్ ప్రభుత్వం మరచిందన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయకుండా వారంతట వారే ఉద్యోగాన్ని వదిలి వెళ్లేలా ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని వారు అన్నారు. ఆర్టీసీ సంస్థలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్డబ్ల్యుఎఫ్ నాయకత్వంలో దశలవారి ఆందోళన పోరాటలను నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ క్రమంలోనే ప్రధాన పోరాటాలు కొనసాగిస్తున్న ఎస్ డబ్ల్యూ ఎఫ్ సంఘ నాయకత్వానికి తెలియజేయకుండా సంప్రదింపులు చేయకుండా సమ్మె నోటీసులు ఇచ్చిన కొన్ని కార్మిక సంఘాల నాయకత్వం వైఖరి సరైనది కాదని వారన్నారు. ఐక్య పోరాటాలకు వేదికగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు నాయకత్వంలో గత అనేక సమ్మెల విజయవంతం అయ్యాయని సదరు కార్మిక సంఘాలకు గుర్తు చేశారు. సమ్మె విజయవంతం కోసం ఆర్టీసీ కార్మికులను చైతన్యవంతం చేయకుండా వారందరినీ సమ్మెకు సన్నద్ధం చేయకుండా కార్మిక యూనియన్లు ప్రజాసంఘాల మద్దతు కూడగట్టకుండా సరాసరి సమ్మెకు పిలుపునివ్వడం నిజమైన సమ్మెను విచ్ఛిన్నం చేయడమేనని వారన్నారు. సమ్మె చేయాలని పిలుపు ఇచ్చిన ప్రజా కార్మిక సంఘాలకు ఆర్టీసీ కార్మిక సంఘాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సమ్మె విజయవంతం కోసం ఎస్ డబ్ల్యూ ఎఫ్ సిఐటియు కూడా సంపూర్ణ మద్దతు తెలుపుతుందని వారన్నారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం ఐక్యంగా సమ్మెకు దిగాలని జేఏసీ నాయకత్వానికి సూచన చేశారు. కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి ఎస్ డబ్ల్యూ ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, టియుసిఐ జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, ఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి గౌను నాగేశ్వరరావు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు నాగకృష్ణ తదితరులు పాల్గొని ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికులకు అండగా ఉంటామని ఏ సమస్య వచ్చినా అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా సమ్మెకు ముందు బాసటగా నిలుస్తామని వారు పిలుపునిచ్చారు. సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రౌండ్ టేబుల్ సమావేశనికి ఎస్ డబ్ల్యూ ఎఫ్ కొత్తగూడెం డిపో అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు కుమార్, కేశవరావు, ఐ.వెంకటేశ్వర్లు, నజీర్, పియల్ రావు, సతీష్, రాంబాబు, శంకర్ పాల్గొన్నారు.

# వేసవి సెలవులు నైపుణ్య శిక్షణకు వేదికలు కావాలి



**నేలకొండపల్లి, మహా:** పది మాసాల పాఠశాల లేదా కళాశాల విద్యా సంవత్సరం పూర్తి కావడం, ఆ తర్వాత పరీక్షలు కూడా పూర్తి అయిన తర్వాత మానసిక ఉల్లాసానికి ఆతిథ్యం ఇచ్చే వేసవి సెలవుల రాక కోసం విద్యార్థి లోకం ఎంతగానో ఎదురుచూడడం జరుగుతుంది. ఏడాదిలో ఒక్కసారి లభించే రెండు మాసాల వేసవి సెలవులు యువతకు ఎన్నో రకాల అనుభవాలను మూటకట్టి పెడతాయి.

**వినోద, విరామ, పునరుత్తేజ కార్యక్రమాలు:**

**అవసరం మేరకు నిద్ర పోవడం, మెదడు చురుదనం**

పెంచడానికి కార్యక్రమాలు, మనసుకు నచ్చిన కార్యక్రమాలు చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించే అంశాలకు సమయం ఇవ్వడం వేసవి సెలవుల్లో మాత్రమే జరుగుతుంది. తమకు నచ్చిన అంశాల కు చెందిన పుస్తకాలు చదవడం, విజ్ఞాన వినోదాత్మక సినిమాలు చూడడం, సుస్వర సంగీతం వినడం, ఆటపాటల్లో మునిగి తేలడం, కుటుంబ సభ్యులు లేదా మిత్రులతో కలిసి బయటకు వెళ్లడం లాంటివి మానసిక వికాసానికి, మనసును తేలిక పర్చుకోవడానికి ఉపకరిస్తాయి. మన ప్రేమను చూరగొన్న సమీప బంధువులు లేదా మిత్రుల వద్దకు వెళ్లడం, పిక్నిక్/జూ/సర్కస్/ఎగ్జిబి షన్లకు వెళ్లడం, మనకు నచ్చిన క్రీడలు లేదా కళల్లో శిక్షణ తీసుకోవడం, వ్యక్తిత్వ వికాస ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ తరగతులకు హాజరుకావడం లాంటివి మంచి నిర్ణయాలు అవుతాయి.

**ఆధునిక డిజిటల్ కాలపు నైపుణ్య వికాస కార్యక్రమాలు:**

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో పుట్టుకొస్తున్న శాస్త్రసాంకేతిక ప్రగతి ఫలాలను ఆస్వాదించడం లేదా నూతన నైపుణ్యాలను అవపోసన పట్టడం, సంగీతం/నాట్యం / పెయింటింగ్ నేర్చుకోవడం, సంగీత వాయిద్యాల్లో శిక్షణలు, కవిత్వం/వ్యాస రచన/కథలు రాయడంతో సాహిత్య రంగంలో తొలి అక్షర అడుగులు వేయడానికి వేసవి సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆసక్తి కలిగిన వారు కొత్త భాషను నేర్చుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, ఆన్లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యాలకు పదును పెట్టడం, జనరల్ నాలెడ్జి పెంచుకోవడం, దిన పత్రికలను చదవడం, పాఠ్యాంశాలకు సంబంధించిన అదనపు పరిజ్ఞానాలను పొందడం, మానసిక పరిపక్వతకు ఆజ్యంపోసే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు హాజరు కావడం లాంటివి పిల్లలకు అందుబాటులో ఉంచాలి.

**ఆరోగ్య పరిరక్షణ - నవ్య జీవనశైలి కార్యక్రమాలు:**

నేటి ఆరోగ్యమే రేపటి భవితకు పెట్టుబడి అని, ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్ముతూ వేసవి సెలవుల్లో ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి. తగినంత సమయం నిద్ర పోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, పరిమిత సమయం పాటు ఆటపాటలకు కేటాయించడం, ప్రతిరోజు కొంత సమయం వ్యాయామం/యోగా/వాకింగ్/స్విమ్మింగ్/ట్రెక్కింగ్/మౌంటెనీరింగ్ చేయడం, సూర్యోదయాన్ని చూసి ఆనందించడం మరువరాదు.

**చేయగూడని కార్యక్రమాలు - తల్లిదండ్రుల పాత్ర:**

వేసవి సెలవుల రూపంలో లభించిన రెండు మాసాల్లో పిల్లల దురలవాట్లు లేదా అనారోగ్యకర దినచర్యలకు అలవాటు పడకుండా చూసుకోవడం పెద్దల కనీస కర్తవ్యం అని తెలుసుకోవాలి. స్మార్ట్ ఫోన్ అతిగా వాడడం లేదా టివీ ముందు కూర్చోవడం మంచి అలవాటు కాదని వారించడం మరువరాదు. ఆన్లైన్ గేమ్స్కు బదులుగా అవుట్ /ఇండోర్ డోర్ గేమ్స్ ఆడడం ఉత్తమమని నమ్మాలి. ఎండలను గమనిస్తూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవి సెలవుల్లో పిల్లల వ్యక్తిత్వ వికాసం జరిగే విధంగా, విజ్ఞాన వంతులుగా మారడానికి తల్లిదండ్రులు పటిష్ట ప్రణాళికలు వేసి వాటిని పక్కాగా అమలు చేయాలి. సెలవుల కాలం సకల నైపుణ్యాలను వడ్డించే నెలవుగా మారాలని కోరుకుందాం.

# బస్తాకు రూ.4 లేదా రూ.5 ఇస్తేనే ఎగుమతులు...!

- డ్రైవర్లు దందాకు రైతుల ఇబ్బందులు
- లేకుంటే ఐదు రోజులైనా బస్తాలు వెళ్లేది లేదు
- రైతులు నిరాకరించటంతో నిలిచిన ఎగుమతులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



**నేలకొండపల్లి, మహా:** రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులను లారీ డ్రైవర్లు ఇబ్బందులు పెడుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే లారీల ఎగుమతులు చేయటం లేదని రైతులు వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మోటాపురం లో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లో రైతుల గోడు ను పట్టించుకునే వారే కరువయ్యారు. కాంటా వేసిన బస్తాలను ఎగుమతి చేసేందుకు లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అవసరం ను బట్టి రూ.4 నుంచి రూ.5 వరకు ఇస్తేనే ఎగుమతులు చేస్తామని డిమాండ్ చేస్తున్నారు.

**దీంతో రైతులు వేలాది రూపాయాలు నష్టపోతున్నారు. ఇబ్బందులు**

పడలేక కొంత మంది రైతులు రూ.2 లను ఇచ్చి ఎగుమతులు చేయించుకుంటున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మిల్లుల వద్ద లారీ దిగుమతుల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని...ఆ నష్టం ను రైతులే డబ్బులు ఇవ్వాల్సిందేనని రైతుల వద్ద నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి లారీలు రాకపోవటంతో ఎక్కడిబస్తాలు అక్కడే మూలుగుతున్నాయి కేంద్రం పై పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. రైతులు డబ్బులు ఇవ్వటం లేదు కాబట్టే రావటం లేదని రైతులు ఆరోపిస్తుండుగా.... మిల్లుల వద్ద దిగుమతులు ఆలస్యం అవుతుందని అందుకే రావటం లేదని నిర్వహాకులు తెలుపుతున్నారు. ఆరుగాలం పండించిన పంట విక్రయం కు వచ్చే సరికి అమ్ముకున్న మొక్కజొన్న ను ఎగుమతులు చేసుకోలేకపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయం పై సోసైటీ కార్యదర్శి రంగారావు ను వివరణ కోరగా... డ్రైవర్లు బలవంతం చేయటం లేదని... ఇష్టమైన వారు ఇస్తే మాకు సంబంధం లేదన్నారు. డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తే సహించమని పేర్కొన్నారు. లారీలు రానీ మాట వాస్తవం అన్నారు.





# పినపాక పట్టి నగర్ కిన్నెరసాని బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

**బూర్గంపహాడ్ మహా :** పినపాక పట్టి నగర్ సమీపం లోని కిన్నెరసాని బ్రిడ్జిపై ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలపాలయ్యారు.వివరాల ప్రకారం, వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తీవ్రత తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది.ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరారైన డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు



# డిఎస్ఆర్ఎస్ఎల్వి పి1 రాకెట్ ప్రయోగం విజయవంతం

- కార్యదర్శి రాజ్ కుమార్ కు పురస్కారం అందజేత
- విద్యార్థులు సురాధికారులు గ్రామ సర్పంచ్ హాజరయ్యారు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇస్రో ఆధ్వర్యంలో నెర్రపల్లి గ్రామంలో ప్రయోగం విజయవంతంగా ప్రయోగించారు. రాకెట్ కలాం దార్శనికత 2047 ఊహకు అందని లక్ష్యంను, ఎస్ఐఎంఎస్ఎంఈ ఫౌండేషన్, అభివృద్ధి లక్ష్యాలను నిలబెట్టుకోవడానికి భారతదేశం సాధన సేవా పురస్కారం అందజేయడం జరుగుతుంది. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం, నెర్రపల్లి గ్రామంలో భారత సాంకేతిక సంస్థ ఇస్రో అధికారుల ఆధ్వర్యంలో, దాదాపు 2000 మంది విద్యార్థుల సమక్షంలో డిఎస్ఆర్ఎస్ఎల్వి పి 1రాకెట్ 2026 ప్రయోగం విజయవంతంగా ప్రయోగించడం జరిగింది. నెర్రపల్లి పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో, గ్రామం, అత్యుత్తమ అంకితభావం నిబద్ధతకు మారుపేరుగా నిలవడంతో, ఈ యొక్క సాధన సేవా పురస్కారాన్ని, ఎస్ఐఎంఎస్ఎంఈ ఫౌండేషన్ వారు, కార్యదర్శి రాజ్ కుమార్ కు ప్రదానం చేశారు. మీ సమయానికి, అంకితభావానికి కృతజ్ఞతాపూర్వక గుర్తింపుగా పురస్కారం అందజేయడం జరిగింది, మీ సహాయం లేకుండా మేము ఇది చేయలేక పోయే వాళ్ళం అని, ఎస్ఐఎంఎస్ఎంఈ ఫౌండేషన్ వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇస్రో అధికారులు రోహన్ డి లహనే, అనురాగ్ పాండే, సూరజ్ సీతారామ, గ్రామ సర్పంచి హేమలత శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు మేకల పద్మా జంగయ్య, అరుణ్ కుమార్ యాదవ్, అఖిల సాయి కిరణ్, బద్దుల నరసింహ యాదవ్, రేణుక శ్రీనివాస్, దుబ్బాక బాలయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల తహసిల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారికంగా తెలియజేశారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 20, 2026న మధ్యాహ్నం 2 గంటలకు ఐటిసి బీపీఎల్ స్కూల్ సారపాక లో జరగనుంది.ఈ అవగాహన కార్యక్రమాన్ని ఎన్డీఆర్ఎఫ్ బృందం నిర్వహించనుండగా, బూర్గంపాడు మండల తహసిల్దార్ అధ్యక్షతన కార్యక్రమం కొనసాగుతుంది. వరదలు సంభవించే సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, అప్రమత్తత సూచనలు మరియు ఇతర ముఖ్య అంశాలపై వివరాలు తెలియజేయనున్నారు. కావున గ్రామ పెద్దలు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, యువకులు, ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని తహసిల్దార్ కోరారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీకి జిల్లా కార్యదర్శిగా నియమితులైన వాసిరెడ్డి సాంబశివరావు

**భద్రాచలం మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీకి జిల్లా కార్యదర్శిగా నియమితులైన వాసిరెడ్డి సాంబశివరావు ఆదివారం నాడు హైదరాబాద్లో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పగించినందుకు వాసిరెడ్డి సాంబశివరావు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.అదే సమయంలో పొదెం వీరయ్య మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించాలని వాసిరెడ్డి సాంబశివరావుకు సూచించారు.

# వేసవికాలం సెలవులో మార్షల్ ఆర్ట్ వైపు విద్యార్థులు చూపు..

## నైపుణ్యం గల మాస్టర్ లతో దేవా కిక్ బాక్సింగ్ శిక్షణ తరగతులు..

**రాజేంద్రనగర్ మహా ;** వేసవికాలం సెలవులో మార్షల్ ఆర్ట్ వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో గత మూడు సంవత్సరాల నుండిదేవా కిక్ బాక్సింగ్ అకాడమీని మాస్టర్ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో నైపుణ్యం గల మార్షల్ ఆర్ట్ నిపుణుల సారుధ్యంలో నడిపిస్తున్నారు.ప్రతి సంవత్సరం వేసవికాలం సెలవులలో అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్ లోని పాఠశాలలో విద్యార్థుల,చున్నారుల తల్లిదండ్రులుకిక్ బాక్సింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. చిన్నారులకు ఇదీ ఒక గొప్ప వ్యాయామంతో పాటు ఎదుగుదలకు తోడ్పడుతుంది. కిక్ బాక్సింగ్ శిక్షణతో మిమ్మల్ని మరింత దృఢంగా తయారు చేస్తుంది. ఆత్మవిశ్వాసంతో మరింత ముందుకు వెళ్లడానికి మార్గం సుగమవుతుంది. శిక్షణ తరగతుల్లోనితోటి విద్యార్థులతోసరదాగా గడుపుతూ మెలకువలు నేర్చుకుంటారు.రెండు నెలలపాటు వేసవికాలం శిబిరంలో చిన్నారులు క్రమశిక్షణతో పాటు దాడుల నుండిరక్షణను నేర్పిస్తుంది. మార్షల్ ఆర్ట్ తో ఆత్మ సంరక్షణలో మెలకువలను నేర్పుతుంది. వేసవికాలం సెలవులలో ఇంట్లో ఖాళీగా కూర్చువడం కంటే ఏదో ఒక మార్షల్ ఆర్ట్ ను నేర్చుకోవాలని తపన చిన్నారుల్లో కనిపిస్తుంది.

# శేరిగూడలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో దారుణం

- హల్ టికెట్ ఇవ్వకపోవడంతో విద్యార్థి ఆత్మహత్య ....
- శ్రీ ఇందు కళాశాల ముందు విద్యార్థి సంఘాల ఆందోళనలు.....
- విద్యార్థి మృతదేహంతో శ్రీ ఇందు కళాశాలలో ధర్నా



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేవలం 5000 అటెండెన్స్ ఫీజు కట్టకపోవడంతో విద్యార్థికి ఎగ్జామినేషన్ హాల్ టికెట్ ఇవ్వని శ్రీ ఇందు కళాశాల యాజమాన్యం కారణంగా ఓ విద్యార్థి ప్రాణం కోల్పోవాల్సి వచ్చింది. విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థి మృతదేహంతో కళాశాలలో ధర్నా చేపట్టారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి, శేరిగూడలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదివే ప్రణీత్ (22)అనే విద్యార్థి, 5000 రూపాయల అటెండెన్స్ ఫీజు కట్టలేదని కళాశాల యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వకపోవటంతో ఇక పరీక్షలు రాయలేనని తీవ్ర మాస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం చేసి, బంధువులకు అప్పజెప్పడం జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ చేపడుతున్నామని ఇబ్రహీం పట్నం ఏసీపి కేపీవీ.రాజు, సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

**శ్రీ ఇందు కళాశాల ముందు పలు విద్యార్థి సంఘాల ఆందోళన.....**

కళాశాల యాజమాన్యాల ఫీజుల దోపిడీ కారణంగా ప్రణీత్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడని యాజమాన్యం విద్యార్థుల పట్ల కర్కశాంగ వ్యవహరించడం వల్లే ప్రాణాలు తీసుకుంటున్నారని విద్యార్థికి న్యాయం జరిగే వరకూ కళాశాల యజమాన్యంతో పోరాడుతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా పలు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల పట్ల కర్కశంగా వ్యవహరించకుండా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీ ఇందు కళాశాల ముందు విద్యార్థి మృతదేహంతో ధర్నా చేపట్టారు.

**విద్యార్థి తల్లిదండ్రుల ఆవేదన....**

విద్యార్థిని కాలేజీ యజమాన్యం అటెండెన్స్ ఫీజు వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు బోరున విలపించారు. అటెండన్స్ ఫీజు కట్టలేదని హాల్ టికెట్ ఇవ్వకపోవడంతోనే తమ కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# భవిష్యత్ తరాల కోసం ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం

- జవహర్ నగర్ లో మూడు కోట్ల విలువైన భూకబ్జాదారుల నుండి విముక్తి
- కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్





**కుషాయిగూడ, మహా :** సర్కారు భూముల పరిరక్షనే ధ్యేయంగా పనిచేస్తున్నామని కబ్జాదారులు అక్రమణలకు పాల్పడితే సహించేది లేదని కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. జవహర్ నగర్ లోని చెన్నాపురం సమీపంలోని సర్వే నెంబర్ 646 లో1.18 ఎకరాల ప్రభుత్వ భూమికి తాసిల్దార్ రాజేష్ ఆధ్వర్యం లో ఆదివారం గిరిదవారి సత్యనారాయణ సమక్షంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పేదలు ప్రభుత్వ భూములను కొని మోసపోవద్దని అక్రమంగా పేపర్ లేఅవుట్ లపై ప్లాట్లు చేసి విక్రయిస్తున్న వారిపై ప్రత్యేక నజరు పెట్టామని అన్నారు. ప్రభుత్వ భూములను భవిష్యత్ తరాల కోసమే పరిరక్షించి వారి కోసమే పరిరక్షిస్తామన్నారు భూకబ్జాదారులు ఎంతటి వారినైనా సరే ఊరుకు నేది లేదని వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు జవహర్ నగర్ సిఐ సైదులు ప్రొటెక్షన్ తో ఒక ఎకరా 18 గుంటల భూమిని భూకబ్జాదారుల చర నుండి విముక్తి కల్పించారు తోసర్కారు భూములను ప్రజా అవసరాలకు వినియోగం అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

# మోడీ,అమిత్ షా కుట్రలు తిప్పికొట్టిన రాహుల్ గాంధీ, ఖర్గే

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి, మహా:** పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్ (131వ రాజ్యాంగ సవరణ) ముసుగులో దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీయాలని చూసిన మోడీ ,అమిత్ షాల కుట్రలను కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వంలో పటాపంచలు చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారుయాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవేళ పార్లమెంట్లో బిల్లు నెగ్గితే బిజెపి తమ ఘనతగా, ఓడిపోతే ప్రతిపక్షాలను టార్గెట్ చేద్దామని కుట్ర పన్నిందని..గతంలో ఇలాగే 2020లో రైతులపై నల్ల చట్టాలు తెద్దామని ప్రజలను వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో బిజెపి బొక్క బోర్ల పడింది..తెలంగాణ రాష్ట్రం తరపున, దక్షిణాది రాష్ట్రాల ఐక్యత కోసం కృషి చేస్తున్న రేవంత్ రెడ్డికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు2024లో రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు ఎత్తేద్దామని, బలహీన వర్గాలని దెబ్బతీయాలని కుట్ర పన్నింది. దేశంలో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ గారు ఉన్నంతవరకు బిజెపి ఆటలు సాగవు.మోదీకి కౌంట్ డౌన్ మొదలైంది. దక్షిణాది రాష్ట్రాలకు మోదీ అన్యాయం చేయాలని చూస్తుంటే రాహుల్ గాంధీ , మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గట్టిగా నిలబడి బిల్లును అడ్డుకోవడం గొప్ప విషయమన్నారు.ఇప్పుడున్న 543 సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుంది.బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన మూడు బిల్లులో మహిళా అంశం లేదన్నారు...డీలిమిటేషన్ పేరుతో మళ్ళీ అధికారంలోకి రావడం కోసం ప్రయత్నం చేస్తున్న భారతీయ జనతా పార్టీ..మహిళా లోకానికి భారతీయ జనతా పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.రాజకీయ అవసరాల కోసం రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలనుకుంటే భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీకి మనుగడ ఉండదు.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా బీజేపీ వైఖరి స్పష్టంగా లేదు. ఈ బిల్లు విషయంలో బీజేపీ ద్వంద్వనీతి కనిపిస్తుంది. మహిళా బిల్లును అమలు చేయాలనే ఉద్దేశం లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం బిల్లును వాడుకుంటున్న విధానం నిన్న తేటతెల్లమైంది.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలే ఈ విషయాన్ని బయటపెట్టాయి. బిల్లు ఆమోదం పొందకపోయినా తమకు నష్టం లేదని చెప్పడం వారి అసలు ఉద్దేశాన్ని వెల్లడిస్తుంది.. దక్షిణాది రాష్ట్రాలను బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు గట్టిగా తిప్పికొడుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి దేశాన్ని రక్షించే శక్తిగా నిలుస్తోంది. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, చిన్న రాష్ట్రాల హక్కులను రక్షించడానికి మా 'ఇండియా' కూటమి పోరాటం కొనసాగుతుందన్నరు.విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు అడెపి సంజీవ రెడ్డి, మదర్ డెరీ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాణి తదితరులు ఉన్నారు.

## మున్నూరుకాపు భవనంలో
# సుదర్శన నరసింహ కళ్యాణం

**పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి, మహా :**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం నిర్వహించారు.108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం జరిగింది. అనంతరం ఒక వెయ్యి ఎనిమిది మంది దంపతులతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు.ఈ కళ్యాణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనిత దంపతులు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించి, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు.ముఖ్యంగా మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో, భారీ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. 108 మంది దంపతులతో హోమం, 1008 మంది దంపతులతో కళ్యాణం నిర్వహించడం విశేషమని కొనియాడారు.ప్రజలందరికీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీపై గులాబీ నేతల కవాతు

- **క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, పుట్ట మధు బృందం**
- **ప్రాజెక్టు వాస్తవ పరిస్థితులపై ఆరా**
- **రాజకీయ విమర్శల నడుమ పర్యటనకు తీవ్ర ప్రాధాన్యత**



**కాళేశ్వరం, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో నిత్యం తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముఖ్య నేతలు సందర్శించారు.ప్రాజెక్టు నిర్వహణ, నిర్మాణాలపై రాజకీయంగా మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకున్న ప్రస్తుత తరుణంలో, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల బృందం నేరుగా మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుని అక్కడి వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించింది.ప్రాజెక్టు వద్ద ఉన్న తాజా పరిస్థితులపై వారు అక్కడి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను స్వయంగా పరిశీలించి ప్రజల ముందు ఉంచే వ్యూహంలో భాగంగానే నేతలు ఈ పర్యటన చేపట్టినట్లు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.ఈ అత్యంత కీలక పర్యటనలో రాష్ట్ర మాజీ మంత్రి, సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు ముందుండి బృందాన్ని నడిపించారు. ఆయనతో పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు కీలక నేతలు బ్యారేజీని పరిశీలించిన వారిలో ఉన్నారు. మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, శంకర్ నాయక్, గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆరూరి రమేశ్, తాడికొండ రాజయ్య, మలావత్ కవిత, గండ్ర జ్యోతి తదితరులు ఈ బృందంలో ఉండి ప్రాజెక్టు నిర్మాణ తీరును, బ్యారేజీ గేట్లను పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించి భౌగోళికంగా పూర్తి స్థాయి అవగాహన ఉన్న మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధూకర్ సైతం ఈ పరిశీలనలో పాల్గొని తోటి నేతలతో పలు కీలక అంశాలపై చర్చించారు. వీరితో పాటు భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేష్ తదితర ముఖ్య నాయకులు కూడా మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన వారిలో ఉన్నారు. ఒకేసారి ఇంతమంది మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మేడిగడ్డకు చేరుకోవడంతో అక్కడ రాజకీయ కోలాహలం నెలకొంది. ప్రాజెక్టు కట్టడాలపై విచారణలు కొనసాగుతున్న వేళ, సీనియర్ నేతలు మూకుమ్మడిగా ఈ పర్యటన చేపట్టడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విపక్షాలు ప్రాజెక్టుపై చేస్తున్న విమర్శలను దీటుగా ఎదుర్కొని, వాస్తవాలను ప్రజలకు వివరించేందుకే ఈ పర్యటన చేపట్టామని నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మొత్తానికి మేడిగడ్డ చుట్టూ అల్లుకున్న రాజకీయ అస్త్రశస్త్రాల నడుమ గులాబీ నేతల క్షేత్రస్థాయి పర్యటన పాలిటిక్స్‌ను మరింత వేడెక్కించింది.

# తెలంగాణను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చేసిన రేవంత్

- **కేసీఆర్ తెచ్చిన గుర్తింపును రెండేళ్లలో నాశనం చేశారు**
- **కాంగ్రెస్ పతనావస్థలో ఉందనే ఎన్డీయేతో సీఎం చీకటి ఒప్పందాలు**
- **ఇరవై నెలలుగా నన్ను మానసికంగా వేధించారు**
- **సభను అడ్డుకునేందుకు కుట్రలు.. అకస్మాత్తుగా హైవేను తవ్వేసిన రేవంత్ సర్కారు**
- **విరుచుకుపడిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి తన సొంత ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని, కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను ఇక్కడ ఒక సామంత రాజుగా కూర్చోబెట్టిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మనుగడ ఇక ప్రశ్నార్థకమేనని, రేవంత్ రెడ్డి పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని ఆయన కుండబద్దలు కొట్టారు. తనను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా మానసికంగా వేధించిందో వివరిస్తూనే, రాబోయే సభను అడ్డుకునేందుకు అధికార పక్షం పన్నుతున్న కుట్రలను ఆయన తీవ్రంగా ఎండగట్టారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నానాటికీ బలహీన పడుతుండటంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తు కోసం జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) తో రహస్యంగా సంబంధాలు పెంచుకుంటున్నారని జీవన్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి చెప్పిన సాకులను ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. పిల్లలు పుట్టాలంటే కనీసం తొమ్మిది నెలల సమయం పడుతుందని నాడు గొప్పలు చెప్పిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి ఏకంగా ముప్పై నెలలు గడుస్తున్నా ప్రజలకు ఏమీ చేయలేకపోయారని ఆయన నిలదీశారు. వాగ్దానాల అమలులో పూర్తిగా విఫలమైన ముఖ్యమంత్రి, ఇప్పుడు ఆ వైఫల్యాలకు ఎవరికి సమాధానం చెబుతారని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని, ప్రజలు స్పష్టమైన మార్పును ఆకాంక్షిస్తున్నారని స్పష్టం చేశారు. గత ఇరవై నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తనను అడుగడుగునా లక్ష్యంగా చేసుకుని మానసికంగా తీవ్ర హింసకు గురిచేసిందని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వేధింపుల నుంచి బయటపడి స్వేచ్ఛగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒక ఉద్యమ నేతగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును తీసుకువస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఆ ప్రతిష్ఠను పూర్తిగా మంటగలిపారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించి, కోల్పోయిన గుర్తింపును తిరిగి తీసుకురావాలంటే అది కేవలం కేసీఆర్ నాయకత్వంతోనే సాధ్యమవుతుందని, అందుకే ఆయన అడుగుజాడల్లో ప్రజల కోసం రాజీలేని పోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లు జీవన్ రెడ్డి ఉద్ఘాటించారు. ప్రజల పక్షాన పోరాడేందుకు తాను సిద్ధమవుతుంటే, దాన్ని చూసి ఓర్వలేక అధికార కాంగ్రెస్ పార్టీ తన సభలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. రేపు జరగబోయే తమ బహిరంగ సభను అడ్డుకునేందుకు ప్రభుత్వం అత్యంత నీచమైన కుట్రలకు తెరతీసిందని ఆరోపించారు. సభను ప్రకటించిన వెంటనే, గత రెండు సంవత్సరాలుగా ఏమాత్రం పట్టించుకోని జాతీయ రహదారి (హైవే) ని రాత్రికి రాత్రే ఉద్దేశపూర్వకంగా తవ్వి పెట్టారని ఆయన విమర్శించారు. సభకు జనం రాకుండా చేయాలన్నదే వారి కుటిల ప్రయత్నమని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, అడ్డంకులు సృష్టించినా ప్రజల మద్దతుతో తమ పోరాటం ఆగదని, రేవంత్ రెడ్డి గద్దె దిగడం, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## హిందూ సంప్రదాయాలపై
# అపార భక్తి

- **తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించిన పవన్ కల్యాణ్ సతీమణి**
- **రష్యన్ అయినా భారతీయ సనాతన ధర్మం పట్ల అచంచల విశ్వాసం**
- **శ్రీ వెంకటేశ్వర స్వామి సేవలో తరించిన ఏపీ డిప్యూటీ సీఎం భార్య అన్నా లెజినోవా**



**తిరుమల, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా హిందూ సంప్రదాయాల పట్ల తనకున్న అపారమైన భక్తిశ్రద్ధలను మరోసారి చాటుకున్నారు. రష్యా దేశానికి చెందిన మహిళ అయినప్పటికీ, భారతీయ సనాతన ధర్మాన్ని, ఇక్కడి సంస్కృతిని ఆమె పూర్తిగా ఒంటపట్టించుకున్నారు. తాజాగా ఆమె కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, హిందూ సంప్రదాయం ప్రకారం స్వామి వారికి తన తలనీలాలను సమర్పించి భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. ఒక విదేశీ వనిత మన సంప్రదాయాలను ఇంత నిష్ఠగా ఆచరించడం ఇప్పుడు సనాతన ధర్మ ప్రేమికులకు, యావత్ హిందూ సమాజానికి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది.శ్రీవారి దర్శనార్థం తిరుమల చేరుకున్న అన్నా లెజినోవా, ఆలయ సంప్రదాయాలను తూచా తప్పకుండా పాటించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి సేవలో పాల్గొన్నారు. విదేశీ మూలాలు ఉన్నప్పటికీ, ఏమాత్రం ఆడంబరాలకు పోకుండా భారతీయ కట్టుబాట్లను, ధార్మిక ఆచారాలను ఆమె ఎంతో గౌరవిస్తున్నారు. అందులో భాగంగానే స్వామివారి దర్శనానంతరం శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన తలనీలాల సమర్పణ (కేశదానం) కార్యక్రమాన్ని అత్యంత భక్తిభావంతో పూర్తి చేశారు. గతంలోనూ ఆమె పలు ధార్మిక కార్యక్రమాల్లో పవన్ కల్యాణ్‌తో కలిసి భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని అందరి మన్ననలు పొందారు. ఆధునికత మోజులో పడి కొందరు స్వదేశీయులే మన సొంత సంప్రదాయాలను విస్మరిస్తున్న ప్రస్తుత రోజుల్లో, అన్నా లెజినోవా లాంటి విదేశీ మహిళ మన సనాతన ధర్మాన్ని ఇంత నిష్ఠగా ఆచరించి చూపించడం పట్ల సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఆమె చూపించిన ఈ భక్తి, నిరాడంబరత చూసి హైందవ సమాజం మొత్తం ముగ్ధురాలవుతోంది. పవన్ కల్యాణ్ భార్యగా ఆమె భారతీయ సంస్కృతిని గౌరవిస్తున్న తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పలువురు నెటిజన్లు, ధార్మిక వేత్తలు కొనియాడుతున్నారు. ప్రస్తుతం ఆమె తిరుమల పర్యటనకు సంబంధించిన విషయాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతుండగా, సనాతన ధర్మాన్ని పాటిస్తున్న ఆమె తీరు పట్ల నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వేగం కన్నా ప్రాణం మిన్న..




- **నెత్తురోడుతున్న రహదారులపై సర్కారు దిద్దుబాటు చర్యలు**
- **ములుగు జిల్లాలో 'అరైవ్ అలైవ్' స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సీతక్క**
- **రాష్ట్రంలో రోజుకు 20 మంది బలి**
- **వాహనదారుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆవేదన**
- **ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా ఇంటికి చేరాలని ప్రజలకు హితవు**
- **ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం**

**ములుగు,మహా:** పరిపాలనలో వేగం, పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అట్టడుగు స్థాయి వరకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పేరిట తెలంగాణ ప్రజాప్రభుత్వం అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేస్తూ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఇందులో ప్రధాన భాగంగా, నిత్యం నెత్తురోడుతున్న రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు 'అరైవ్ అలైవ్' పేరిట వారం రోజుల పాటు రోడ్డు భద్రత స్పెషల్ డ్రైవ్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించనున్నారు.ఈ బృహత్తర కార్యక్రమానికి ములుగు జిల్లా మేడారం సమీపంలోని జంగాలపల్లి వేదికగా అంకురార్పణ జరిగింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఈ రోడ్డు భద్రతా ఉత్సవాలను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ, మున్సిపల్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రత ప్రాముఖ్యతను వివరించే పలు కార్యక్రమాలను వారు స్వయంగా పర్యవేక్షించారు. రోడ్డు ప్రమాదాల్లో జరుగుతున్న ప్రాణనష్టంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

కేవలం కొద్దిపాటి నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ఎందరో తమ ప్రాణాలను గాల్లో కలిపేసుకుంటున్నారని, వారి పొరపాట్ల వల్ల అమాయకులైన ఎదుటివారు సైతం బలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రతిరోజూ సగటున 20 మంది, ఏడాదికి ఏకంగా 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం పాలవుతున్నారని ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఏటా సుమారు లక్షా యాభై వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, లక్షలాది మంది తీవ్ర గాయాలతో శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారని స్పష్టం చేశారు. ఒక్క ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తం చెల్లాచెదురై, రోడ్డున పడుతున్న హృదయ విదారక ఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నామని ఆయన ఆవేదన చెందారు. మనుషుల ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా ఉండాలంటే పౌరుల్లో స్వచ్ఛందంగా మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. జీవితంలో ఏ గొప్ప లక్ష్యాన్ని సాధించాలన్నా ముందుగా మనం బతికి ఉండటం అత్యంత ప్రధానమన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించకపోవడం, ముఖ్యంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. వేగం కన్నా ప్రాణం చాలా విలువైందని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించి క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలని ఆయన రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గాంధీభవన్‌లో ప్రక్షాళన పర్వం

**ఉత్తర్వులు జారీ చేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా:**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పులకు అధిష్ఠానం పదును పెట్టింది.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రక్షాళన దిశగా కీలక అడుగులు వేస్తూ, పార్టీలో అత్యంత కీలకమైన ప్రొటోకాల్ మరియు కోఆర్డినేషన్ కమిటీని అకస్మాత్తుగా పునర్వ్యవస్థీకరిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పక్కా వ్యూహంతో ఇచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆదివారం ఈ నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు. పార్టీలో సమన్వయ లోపాన్ని సరిదిద్ది, ప్రభుత్వానికి మరియు పార్టీ శ్రేణులకు మధ్య వారధిగా పనిచేసేలా ఈ కమిటీకి కొత్తరూపునిచ్చినట్లు గాంధీభవన్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. తాజాగా ప్రకటించిన ఈ ప్రతిష్ఠాత్మక కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత హర్కర వేణుగోపాల్ రావుకు అధిష్ఠానం పెద్దపీట వేసింది. పార్టీలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆయన అనుభవాన్ని, పనితీరును దృష్టిలో ఉంచుకుని ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు స్పష్టమవుతోంది. అదేవిధంగా కమిటీ వైస్ చైర్మన్‌గా కిశోర్ రెడ్డిని, కన్వీనర్‌గా ఎం.ఏ. ఫహీమ్‌ను నియమిస్తూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ తరపున నిర్వహించే అధికారిక కార్యక్రమాలను, ప్రభుత్వ ప్రొటోకాల్ వ్యవహారాలను, నాయకుల మధ్య సమన్వయాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకునే బాధ్యతను ఈ నూతన బృందానికి అప్పగించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ విడుదల చేసిన అధికారిక ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.వీరితో పాటు ఈ అత్యున్నత సమన్వయ కమిటీలో మరో ఐదుగురు నేతలకు సభ్యులుగా అవకాశం కల్పించారు. ఎన్. భాను ప్రకాష్ రెడ్డి, కేవీ ప్రసాద్, సురజ్ తివారి, సుదిని మహేందర్, అల్లం రాకేష్‌లను నూతన కమిటీలో సభ్యులుగా నియమిస్తూ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్టీలోని వివిధ సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను బేరీజు వేసుకుని ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ జాబితాను స్వయంగా పర్యవేక్షించి ఖరారు చేసినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడం, దిగువ స్థాయి కార్యకర్తల నుంచి రాష్ట్రస్థాయి నాయకుల వరకు సమన్వయం పెంచడం లక్ష్యంగానే అధిష్ఠానం ఈ మార్పులకు శ్రీకారం చుట్టిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కీలక కమిటీల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయం గాంధీభవన్‌లో సరికొత్త రాజకీయ కోలాహలం నెలకొంది.

# నేడు భూపాలపల్లికి సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలకు కేంద్రబిందువైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటన చేయనున్నారు. అనేక కీలక పరిణామాల మధ్య జరుగుతున్న ఈ పర్యటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మధ్యాహ్నం జిల్లాకు చేరుకోనున్న ముఖ్యమంత్రి, ముందుగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం, కాళేశ్వరం ఆలయ అభివృద్ధి కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పనులకు ఆయన స్వయంగా భూమిపూజ చేసి ఆ కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం ఆయన నేరుగా రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ సైట్ కు పయనం కానున్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ముఖ్యమంత్రి పర్యటన రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కుంగిన మేడిగడ్డ డ్యామ్ సైట్ ను ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించనున్నారు. అక్కడికక్కడే రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో అత్యంత కీలకమైన సమీక్షా సమావేశం నిర్వహించి, ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీయనున్నారు. ఈ హైలెవల్ రివ్యూ ముగిసిన వెంటనే బ్యారేజీ వద్దే ముఖ్యమంత్రి మీడియాతో ముఖాముఖి మాట్లాడనున్నారు. మేడిగడ్డ డ్యామ్ సైట్ వేదికగా విపక్షాలపై ముఖ్యమంత్రి ఏ విధమైన సంచలన వ్యాఖ్యలు చేయబోతున్నారు, ప్రాజెక్టు భవితవ్యం, విచారణల పురోగతిపై ఎలాంటి కీలక ప్రకటన చేయబోతున్నారన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రాజెక్టు పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా కాటారం మండలం నస్తురపల్లిలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటారు. వేలాది మంది ప్రజలు, రైతుల సమక్షంలో సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. ఇదే భారీ బహిరంగ సభ వేదికగా రాష్ట్ర రైతాంగానికి ప్రభుత్వం తరపున అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'రైతు భరోసా' రెండో విడత నిధులను ముఖ్యమంత్రి లాంఛనంగా విడుదల చేయనున్నారు. అన్నదాతలకు అండగా నిలిచేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రజాక్షేత్రంలో వివరించనున్నారు. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై క్షేత్రస్థాయి పరిశీలన, మరోవైపు వ్యవసాయ రంగ అభివృద్ధిపై ప్రభుత్వ నయా కార్యాచరణ.. ఈ రెండు కీలక అంశాల నడుమ సాగుతున్న సీఎం రేవంత్ రెడ్డి తాజా పర్యటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర కాక రేపుతోంది.

# మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై కేంద్రం క్లారిటీ

- **వీగిపోయిన బిల్లులపై ఎఫ్ఏక్యూ విడుదల**
- **దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు.. ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది**
- **సమాన దామాషా పద్ధతిలోనే లోక్‌సభ సీట్ల పెంపు**
- **బిల్లులు ఆమోదం పొందితే 2029 నాటికే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు**
- **ప్రతిపక్షాల అపోహలకు చెక్ పెడుతూ పబ్లిక్ డొమైన్‌లోకి సమగ్ర సమాధానాలు**

**హైదరాబాద్, మహా:** పార్లమెంటు వేదికగా ఇటీవల ప్రతిపక్షాల వ్యతిరేకతతో వీగిపోయిన కీలక బిల్లుల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై పబ్లిక్ డొమైన్‌లో, ముఖ్యంగా రాజకీయ వర్గాల్లో నెలకొన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేస్తూ అధికారికంగా ఒక సమగ్ర 'ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్' (ఎఫ్ఏక్యూ) పత్రాన్ని విడుదల చేసింది. ఏప్రిల్ 16, 2026న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లుల వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను కేంద్రం ఇందులో అత్యంత స్పష్టంగా వివరించింది. కేవలం రాజకీయ స్వార్థంతో ప్రతిపక్షాలు సృష్టించిన భయాందోళనల్లో ఎలాంటి వాస్తవం లేదని ఈ పత్రం కుండబద్దలు కొట్టింది. ముఖ్యంగా ఈ మూడు బిల్లులను ప్రస్తుత తరుణంలో ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందన్న దానిపై కేంద్రం పక్కా లాజిక్ తో సమాధానమిచ్చింది. 'నారీ శక్తి వందన్ అధినియం' కింద మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే, 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ పూర్తి కావాల్సి ఉంది. ఆ ప్రక్రియ కోసం ఎదురుచూస్తే 2029 సాధారణ ఎన్నికల నాటికి మహిళలకు రిజర్వేషన్లు దక్కే అవకాశం ఏమాత్రం లేదు. కాబట్టి, సగం జనాభాగా ఉన్న మహిళలకు తక్షణమే లబ్ధి చేకూర్చేందుకే ఈ నిబంధనను డీలింక్ చేస్తూ బిల్లులు తీసుకువచ్చామని కేంద్రం స్పష్టం చేసింది. ఇక లోక్‌సభ స్థానాల గరిష్ఠ పరిమితిని 850కి ఎందుకు పెంచాల్సి వచ్చిందన్న ప్రశ్నకు సైతం పక్కా వివరణ ఇచ్చింది. 1976లో దేశ జనాభా 54 కోట్లు ఉన్నప్పుడు లోక్‌సభ సీట్ల సంఖ్యను 550గా నిర్ధారించారని, ప్రస్తుతం జనాభా 140 కోట్లకు చేరినందున, ప్రజలకు సరైన ప్రాతినిధ్యం దక్కాలంటే సీట్లను 850కి పెంచక తప్పదని తేల్చిచెప్పింది. ఈ బిల్లుల వల్ల జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ విపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని కేంద్రం ఎఫ్ఏక్యూలో బలంగా తిప్పికొట్టింది. సీట్ల పెంపు అనేది ఒకే రకమైన 'దామాషా విస్తరణ' (ప్రపోర్షనల్ ఎక్స్‌పాన్షన్) పద్ధతిలో జరుగుతుందని, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సమానంగా 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని క్లారిటీ ఇచ్చింది. ఈ లెక్కన ప్రస్తుతమున్న 543 సీట్లు సుమారు 816కు పెరుగుతాయని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గకపోగా, మరింత మెరుగుపడుతుందని గణాంకాలతో సహా నిరూపించింది. ప్రస్తుత లోక్‌సభలో 23.76 శాతంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, కొత్త బిల్లుల ప్రకారం 23.87 శాతానికి చేరుతుందని స్పష్టం చేసింది. సీట్ల పెంపుతో ఏపీకి 38, తెలంగాణకు 26, తమిళనాడుకు 59, కర్ణాటకకు 42, కేరళకు 30 చొప్పున లోక్‌సభ స్థానాలు దక్కుతాయని, జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని కేంద్రం నిస్సందేహంగా వెల్లడించింది. ఇక డీలిమిటేషన్ కమిషన్ చట్టాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మార్చే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలను సైతం కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. కమిషన్ చట్టంలో ఎలాంటి మార్పులు ప్రతిపాదించలేదని, ప్రస్తుత చట్టబద్ధమైన ఫ్రేమ్‌వర్క్ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. అలాగే లోక్‌సభ స్థానాల విస్తరణ వల్ల ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు దక్కే రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుందని, తద్వారా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం మరింత బలోపేతం అవుతుందని వివరించింది. కుల గణనను ఆలస్యం చేసేందుకే ఈ రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చారన్న వాదనలో ఎలాంటి పస లేదని కొట్టిపారేసింది. మొత్తంగా విపక్షాల కుతర్కాల వల్లే మహిళలకు తక్షణమే దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్ల ఆశలు ఆవిరయ్యాయన్న వాస్తవాన్ని కేంద్రం విడుదల చేసిన ఈ పత్రం ప్రజల కళ్లకు కట్టింది.



**Women's Reservation**

**Frequently Asked Questions (FAQs)**

**1. Which Bills were introduced by the Central Government in the Lok Sabha on 16 April 2026?**

On 16 April 2026, the Central Government introduced three key Bills in the Lok Sabha:

- The Constitution (One Hundred and Thirty-First Amendment) Bill, 2026
- The Delimitation Bill, 2026
- The Union Territories Laws (Amendment) Bill, 2026

**2. Why were these three Bills brought at this point in time?**

The Nari Shakti Vandan Adhiniyam provides that reservation for women will be implemented based on delimitation after the Census conducted post-2026. If the Government had waited for the Census and subsequent delimitation, women would not have been able to benefit from 33 percent reservation even in the 2029 general elections as the census and subsequent delimitation period takes time. Therefore, to ensure timely benefits to half the population, it was considered necessary to delink implementation of the Act from this condition.

**3. What would have been the benefits if these Bills had been passed?**

If passed and approved, these Bills would have enabled women to receive 33 percent reservation in the Lok Sabha as early as the 2029 general elections.

**4. Why was delimitation linked with the Nari Shakti Vandan Adhiniyam, and why was there a proposal to increase seats?**

Delimitation means finalising the boundary of a constituency. It is essential for implementing women's reservation. The limit on seats in Lok Sabha was set at 55o in 1976. In 1971, the population of India was 54 Crore. Today it is 140 Crore. Therefore, it is important to increase seats to 850 in Lok Sabha. This would enable fair representation of people in the Parliament.

**5. Was there any attempt to modify the Delimitation Commission Act for political advantage? Would ongoing state elections be affected?**

No changes were proposed to the Delimitation Commission Act. The existing legal framework remains intact, and any recommendations of the Commission would require parliamentary approval and Presidential assent. Ongoing elections, including those in states like Tamil Nadu or West Bengal, would not be affected, as elections up to 2029 will be conducted under the current system.

**6. What was the rationale behind increasing Lok Sabha seats to 850?**

The proposal was based on a proportional expansion approach. A uniform 50 percent increase in seats would maintain the proportion for all states and UTs. Applying this principle to the current 543 seats would lead to approximately 815 seats. Therefore, the upper limit on seats was increased from current cap of 550 seats in Lok Sabha to 850 seats.

**7. Would southern or smaller states have been adversely affected by the new delimitation proposal?**

No. All states would see uniform 50 percent increase in seats. Southern states would not face any reduction in representation; rather, their overall share would remain stable. For example, Tamil Nadu's seats would increase proportionally, ensuring no disadvantage. As the table below shows, the southern states currently have 23.76 % seats in Lok Sabha. This would have become 23.87 % after passage of the Bills.

| Sl. No. | State | Total Seats 543 Number of Seats | Present Status Percentage of 543 | Increase of 50% (Appx.) | Revised Status Percentage of 816 |
|---|---|---|---|---|---|
| 1. | Karnataka | 28 | 5.15% | 42 | 5.14% |
| 2. | Andhra Pradesh | 25 | 4.60% | 38 | 4.65% |
| 3. | Telangana | 17 | 3.13% | 26 | 3.18% |
| 4. | Tamil Nadu | 39 | 7.18% | 59 | 7.23% |
| 5. | Keralam | 20 | 3.68% | 30 | 3.67% |
| | Total | 129 | 23.76 (Appx. 24%) | 195 | 23.87 (Appx. 24%) |

(543 seats to 816 seats (50% increase model))

**8. Would states that have controlled population growth face any disadvantage?**

No, as the increase in seats was proposed uniformly across states, their proportional representation would remain unchanged or slightly improve.

**9. Would the representation of Scheduled Castes and Scheduled Tribes be affected?**

No, the process of delimitation ensures proportional reservation for Scheduled Castes and Scheduled Tribes. With an expanded House, the number of reserved seats would increase significantly, thereby strengthening their representation.

**10. Was this Constitutional Amendment Bill introduced to delay caste census?**

# అభినవ గోబెల్స్ రేవంత్ రెడ్డి..

- అబద్ధాల పునాదులపైనే సీఎం పీఠం
- కాంగ్రెస్ మాయమాటలకు మహిళలు బలి
- తులం బంగారం, స్కూటీ ఏమాయె?
- మహిళా బిల్లును అడ్డుకుని దక్షిణాదికి ద్రోహం
- నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందన్న శాపం ఆయనకున్నట్లుంది
- దొంగ హామీల అమలులో కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ సర్కారు
- రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్



**హైదరాబాద్, మహా:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి అబద్ధాల పునాదులపైనే ఆ పదవిని అధిష్టించారని, ఆయనొక 'అభినవ గోబెల్స్' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి తెలంగాణ మహిళలను కాంగ్రెస్ పార్టీ నిలువునా వంచించిందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన పదునైన వ్యాఖ్యలతో కూడిన ఒక అధికారిక ప్రకటనను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, ఇండీ కూటమి కుట్రలను ప్రజాక్షేత్రంలో ఉతికి ఆరేశారు.అబద్ధాలు, మోసాలు చేసే వారినే సమాజంలో ప్రజలు నమ్ముతారని బహిరంగంగా ప్రకటించిన నాయకుడు రేవంత్ రెడ్డి అని, అదే అబద్ధాలతో ఆయన పబ్బం గడుపుకుంటున్నారని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజల చెవిలో పూలు పెట్టిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రతినెలా రూ. 2500 ఇస్తామని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం, యువతులకు ఉచితంగా స్కూటీ ఇస్తామని ఆశచూపి.. నేడు ఆ హామీలన్నింటికీ నిర్దాక్షిణ్యంగా తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుశా నిజం చెబితే తల వెయ్యి ముక్కలవుతుందన్న శాపం ఏమైనా రేవంత్ రెడ్డికి ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరహాలోనే దొంగ హామీలతో, పచ్చి అబద్ధాలతో పాలన సాగిస్తూ, నిజాయితీగా పనిచేసే నాయకులపై బురద చల్లడం ముఖ్యమంత్రికి పరిపాటిగా మారిందని ఆయన దుయ్యబట్టారు.దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుల విషయంలో రేవంత్ రెడ్డి, ఇండీ కూటమి నేతలు అనుసరించిన తీరును బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, ప్రతి రాష్ట్రానికి 50 శాతం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను పెంచి దక్షిణాదికి న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో బిల్లు తెస్తే.. దానిని విపక్షాలు అడ్డుకున్నాయని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న వాస్తవాన్ని ముందే పసిగట్టిన కేంద్రం, ప్రతి రాష్ట్రానికీ సమానంగా 50 శాతం సీట్లు పెంచేలా రాజ్యాంగ సవరణ బిల్లు తెస్తే కాంగ్రెస్ నేతలు కుటిల రాజకీయాలతో అడ్డుపడ్డారని విమర్శించారు. రేవంత్ రెడ్డి, ఎంకే స్టాలిన్ వంటి నేతలు అపోహలు సృష్టించి దక్షిణాదికి ఉన్న అద్భుతమైన అవకాశాలకు గండికొట్టి, చారిత్రక ద్రోహం చేశారని ఆరోపించారు.మహిళా బిల్లును అడ్డుకుని, అడ్డుకోవడంలో తామేదో ఘనకార్యం సాధించినట్లు ఇండీ కూటమి నేతలు సంబరాలు చేసుకోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బండి సంజయ్ మండిపడ్డారు. తెలంగాణ మహిళలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 70 కోట్ల మంది మహిళలు కాంగ్రెస్ చేసిన ఈ ఘోర అవమానాన్ని ఎన్నటికీ మర్చిపోరని హెచ్చరించారు. కుటిల రాజకీయాలతో మహిళల కలలను కల్లలు చేసిన రేవంత్ సర్కారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, మహిళలంతా ఏకమై ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం తథ్యమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ మోసాలను, అబద్ధాలను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికీ తీసుకువెళ్లి వారి బండారం బయటపెట్టేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సమరశంఖం పూరించేందుకు సన్నద్ధమవుతున్నాయని బండి సంజయ్ తన ప్రకటనలో వెల్లడించారు.

# ఆపరేషన్ ఆక్టోపస్-2.0 సక్సెస్

- దేశవ్యాప్తంగా భారీ సైబర్ నెట్‌వర్క్ గుట్టురట్టు
- సైబర్ దొంగలతో కుమ్మక్కైన 32 మంది బ్యాంకు అధికారులు అరెస్ట్
- 9 రాష్ట్రాల్లో హైదరాబాద్ పోలీసుల ఏకకాల దాడులు
- మొత్తం 52 మంది నిందితుల పట్టివేత
- రూ. 150 కోట్ల కుంభకోణం.. 850 కేసులతో లింకులు
- విస్తుపోయే నిజాలు వెలుగులోకి
- మ్యూల్ ఖాతాలతో సహకరించిన బ్యాంక్ సిబ్బంది




**హైదరాబాద్, మహా:** సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేసే దిశగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించి సంచలన విజయాలు సాధించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్2.0' పేరుతో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక ఆపరేషన్‌లో సుమారు రూ. 150 కోట్ల మేర జరిగిన ఒక మహా సైబర్ కుంభకోణం గుట్టురట్టయింది. సామాన్యుల ఖాతాలకు రక్షణగా నిలవాల్సిన బ్యాంకు అధికారులే కాసులకు కక్కుర్తిపడి సైబర్ దొంగలతో చేతులు కలపడం దర్యాప్తులో విస్తుపోయేలా చేసింది. హైదరాబాద్ పోలీసులు మొత్తం 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించి, 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మంది నిందితులను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 850కి పైగా సైబర్ మోసాల కేసులతో వీరికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు పోలీసులు బట్టబయలు చేశారు. పెట్టుబడి స్కామ్‌లు, ట్రేడింగ్ మోసాలు, మరియు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయక ప్రజలను భయాందోళనలకు గురిచేసి భారీగా సొమ్ము దోచుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠాలకు అండగా నిలుస్తున్న బ్యాంక్ అధికారులే ప్రధాన లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగింది. అరెస్ట్ అయిన 52 మందిలో ఏకంగా 32 మంది బ్యాంకు అధికారులు ఉండటం ఈ స్కామ్ తీవ్రతను, బ్యాంకుల్లో నెలకొన్న భద్రతా లోపాలను తెలుపుతోంది. వీరితో పాటు 15 మంది మ్యూల్ ఖాతాదారులు, ఐదుగురు మధ్యవర్తులు కూడా ఉన్నారు. సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కైన ఈ బ్యాంకు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అమాయకుల సొమ్మును దారి మళ్లించేందుకు ఏకంగా 350 అక్రమ బ్యాంకు ఖాతాలను (మ్యూల్ అకౌంట్స్) పక్కా ప్రణాళికతో తెరిచి ఇచ్చారని దర్యాప్తులో తేలింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు, ఏసీపీ ఆర్. జి. శివ మారుతి నేతృత్వంలో 16 ప్రత్యేక పోలీసు బృందాలు ఈ 'ఆపరేషన్ ఆక్టోపస్2.0'లో పాల్గొన్నాయి. మొత్తం 7 రోజుల పాటు తొమ్మిది రాష్ట్రాల్లో అలుపెరగకుండా దాడులు నిర్వహించి ఈ భారీ నెట్‌వర్క్‌ను ఛేదించాయి. గత ఫిబ్రవరిలో నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్1'లో 16 రాష్ట్రాల నుంచి 117 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ ఆపరేషన్‌లో వెలుగు చూసిన కీలక ఆధారాలతోనే ఇప్పుడు రెండో విడతగా దాడులు చేపట్టారు. ఖాతాదారుల భద్రతను గాలికొదిలి, నిబంధనలను తుంగలో తొక్కి దొంగలకు దారులు వేసిన బ్యాంకు అధికారుల పాత్రపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ అధికారులు మరింత లోతైన విచారణ జరుపుతున్నారు.



## జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా మెదక్ ఎంపీ రఘునందన్

**జనరల్ బాడీ సమావేశంలో మరోసారి ఏకగ్రీవ ఎన్నిక**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ రోజు లక్డికాపూల్ లోని ఒక ప్రైవేట్ హోటల్ లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు ఎన్నిక ప్రక్రియ జరిగింది. తెలంగాణ లో జిమ్నాస్టిక్స్ ఎదుగుదలకు మరింతగా కృషి చేసి మారుమూలల గ్రామాల నుంచి కూడా క్రీడాకారులను ప్రోత్సహించి గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తానని రఘునందన్ రావు పేర్కొన్నారు.



# మే 4 తర్వాత ఎవరినీ వదిలిపెట్టం..

- మాఫియా ఆటలు ఇక సాగవు
- 29లోగా పోలీసుల ముందు లొంగిపోవాల్సిందే...
- టీఎంసీ జంగల్ రాజ్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం..
- తృణమూల్ సిండికేట్‌పై ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాటల తూటాలు పేల్చారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ టార్గెట్‌గా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పాలనపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా విహరిస్తున్న మాఫియా, టీఎంసీ సిండికేట్లకు ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడే మే 4వ తేదీ తర్వాత రాష్ట్రంలో ఏ ఒక్క అక్రమార్కుడినీ వదిలిపెట్టబోమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బిష్ణుపూర్, పురూలియాలో జరిగిన విజయ సంకల్ప సభల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. రాష్ట్ర సర్కారు వైఫల్యాలను, అవినీతిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు.

**మాఫియా లొంగిపోవాల్సిందే.. గిరిజనులకు అన్యాయం**

బిష్ణుపూర్ సభలో ప్రధాని మాట్లాడుతూ.. బిష్ణుపూర్ మాఫియా, టీఎంసీ సిండికేట్ ఆటలు ఇకపై సాగవని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారంతా ఈ నెల 29లోగా తమంతట తాముగా వెళ్లి పోలీస్ స్టేషన్లలో లొంగిపోవాలని ఆయన డెడ్‌లైన్ విధించారు. అనంతరం పురూలియా సభలో ప్రసంగించిన ఆయన.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అమాయకులైన ఆదివాసీల భూములను టీఎంసీ సిండికేట్లు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాయని ఆరోపించారు. అధికార పార్టీ నేతలు 'కట్‌మనీ' (కమీషన్ల) దందాకు తెరలేపారని, వారి స్వార్థం వల్లే రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రావడం లేదని, ఉపాధి కొరత ఏర్పడిందని ప్రధాని ధ్వజమెత్తారు.

**సిండికేట్లను కూకటివేళ్లతో పెకిలిస్తాం**

పశ్చిమ బెంగాల్‌లోని వ్యవసాయ మౌలిక సదుపాయాలన్నీ టీఎంసీ సిండికేట్ గుప్పిట్లోనే బందీ అయ్యాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మండీలు, కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగులు) సౌకర్యాల నియంత్రణను అధికార పార్టీ తమ సిండికేట్ సభ్యులకు అప్పగించి రైతుల పొట్టగొడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ సిండికేట్ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించివేస్తామని ఆయన ప్రజల సాక్షిగా శపథం చేశారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో మమత ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందని, వేలాది మంది అర్హులైన యువత జీవితాలతో చెలగాటమాడిందని మండిపడ్డారు. గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో బెంగాల్‌లో నిరుద్యోగం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుందని, ఈ 'మహా జంగల్ రాజ్' వల్లే రాష్ట్రం పెను సంక్షోభంలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు.

**ఈసారి బీజేపీదే భారీ మెజారిటీ!**

ఎన్నికల ఫలితాలపై తనకున్న ధీమాను ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యక్తపరిచారు. "సాధారణంగా నేను ఎన్నికల అంచనాలు వేయను, ఫలితాలు ఎలా ఉంటాయో ముందుగా చెప్పను. కానీ ఈసారి బెంగాల్‌లో నేను కలిసిన ప్రతి ఒక్కరూ ఇక్కడ బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని బలంగా చెబుతున్నారు" అని ఆయన అన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ అపూర్వ స్పందన చూస్తుంటే, ఈసారి రాష్ట్రంలో బీజేపీ అత్యంత భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందన్న నమ్మకం తనకు కలిగిందని ధీమా వ్యక్తం చేశారు. టీఎంసీ సుదీర్ఘ పాలనలో రాష్ట్రాభివృద్ధి అడుగంటిపోయిందని, రోడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా, పాఠశాలలు, ఆసుపత్రుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని మోదీ విమర్శించారు.




# సీబీఐకి అడ్డంగా దొరికిన ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్

- ఏలూరులో అవినీతి బాగోతం
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ముగ్గురు బ్యాంక్ అధికారులు
- రూ. 50 లక్షల సీసీ లిమిట్ రద్దు చేస్తామని బెదిరింపులు
- ఆడిటర్ పేరు చెప్పి దందాలకు తెరలేపిన సిబ్బంది
- విజయవాడ కోర్టుకు నిందితులు

**విజయవాడ, మహా:** ఏలూరు జిల్లా కేంద్రంలోని నరసింహారావు పేటలో ఉన్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో భారీ అవినీతి బాగోతం వెలుగుచూసింది. కస్టమర్ల అకౌంట్లలో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ వారిని భయపెట్టి లంచాలు డిమాండ్ చేస్తున్న ముగ్గురు బ్యాంకు అధికారులను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏప్రిల్ 18, 2026న ఒక ఫిర్యాదుదారుడి నుంచి రూ. 25,000 లంచం తీసుకుంటుండగా బ్రాంచ్ చీఫ్ మేనేజర్, క్లర్క్‌కమ్‌క్యాషియర్, అలాగే గోల్డ్ అప్రైజర్‌లను సీబీఐ అధికారులు పక్కా వ్యూహంతో వలపన్ని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీబీఐ పత్రికా ప్రకటనను విడుదల చేసింది.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఏలూరులో ఆటో ఏజెన్సీ నడుపుతున్న ఒక వ్యాపారి తన దైనందిన వ్యాపార లావాదేవీల నిమిత్తం ఇండియన్ బ్యాంక్ నరసింహారావు పేట బ్రాంచ్ నుంచి రూ. 50 లక్షల ఓపెన్ క్యాష్ క్రెడిట్ (OCC) లిమిట్ మంజూరు చేయించుకున్నారు. అయితే, సదరు వ్యాపారి వ్యక్తిగత పని మీద మార్చి 30, 2026 నుంచి ఏప్రిల్ 17 వరకు రాజస్థాన్ వెళ్లారు. సరిగ్గా ఇదే అదనుగా భావించిన బ్రాంచ్ చీఫ్ మేనేజర్, క్లర్క్ ఆయనకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. బ్యాంకు ఆడిటర్ తనిఖీలకు వచ్చారని, మీ అకౌంట్‌లో కొన్ని సాంకేతిక లోపాలు ఉన్నాయని సాకులు చెప్పారు. మీ అకౌంట్ లిమిట్‌ను రూ. 50 లక్షల నుంచి రూ. 20 లక్షలకు తగ్గిస్తామని, లేదా అకౌంట్‌ను ఎన్‌పీఏ (NPA నిరర్థక ఆస్తి) గా ప్రకటిస్తామని తీవ్రంగా భయపెట్టారు. అకౌంట్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగాలంటే లక్షకు వెయ్యి రూపాయల చొప్పున మొత్తం రూ. 50 వేలు లంచం ఇచ్చుకోవాలని చీఫ్ మేనేజర్ డిమాండ్ చేశాడు. చివరికి బేరసారాల తర్వాత ఆ మొత్తాన్ని రూ. 30 వేలకు కుదుర్చుకున్నారు.బ్యాంకు ఆడిటర్ మీ అకౌంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు తాము ఇప్పటికే ఆయనకు లంచం కింద కొంత మొత్తం ఇచ్చేశామని బుకాయిస్తూ.. ఫిర్యాదుదారుడి నుంచి రూ. 25 వేలు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 18న కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు పక్కా ప్లాన్‌తో ట్రాప్ చేశారు. సదరు వ్యాపారి నుంచి ఆ రూ. 25 వేల లంచం నగదును తీసుకుంటుండగా చీఫ్ మేనేజర్, క్లర్క్‌కమ్‌క్యాషియర్ మరియు గోల్డ్ అప్రైజర్‌లను అడ్డంగా పట్టుకున్నారు. అరెస్ట్ చేసిన ఈ ముగ్గురు నిందితులను విజయవాడలోని కాంపిటెంట్ కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు సీబీఐ వెల్లడించింది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉందని, అధికారుల ఇళ్లు, తదితర ప్రాంతాల్లో సోదాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తమ ప్రకటనలో స్పష్టం చేసింది. సామాన్యులకు అండగా నిలవాల్సిన బ్యాంకు అధికారులే ఇలా అక్రమాలకు పాల్పడటం ఏలూరులో తీవ్ర కలకలం రేపుతోంది.

# ఫేక్ కంటెంట్‌పై ఈసీ కొరడా..

- దృష్టికి వచ్చిన 3 గంటల్లో డిలీట్ చేయాల్సిందే
- ఏఐ కంటెంట్‌కు లేబుల్ తప్పనిసరి
- 11 వేలకు పైగా నకిలీ పోస్టులపై ఈసీ యాక్షన్
- 100 నిమిషాల్లోనే కంప్లైంట్ క్లియర్..
- సీ-విజిల్ యాప్ ద్వారా 3 లక్షల ఫిర్యాదుల పరిష్కారం
- 5 రాష్ట్రాల ఎన్నికలపై పకడ్బందీ నిఘా

**హైదరాబాద్, మహా:** తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ (ఫేక్) కంటెంట్ కనిపిస్తే తమ దృష్టికి వచ్చిన కేవలం 3 గంటల్లోగా రాజకీయ పార్టీలు వాటిని వెంటనే తొలగించాలని ఈసీ కఠినంగా ఆదేశించింది. మార్చి 15న ఈ ఐదు చోట్లా ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా సోషల్ మీడియాలో ఉన్న 11 వేలకు పైగా ఫేక్ పోస్టులు, యూఆర్‌ఎల్‌లను గుర్తించి తొలగించినట్లు వెల్లడించింది. ఆయా ఫేక్ కంటెంట్‌లను పోస్ట్ చేసిన వారిపై పోలీసు స్టేషన్లలో ఎఫ్‌ఐఆర్‌లు కూడా నమోదు చేయించామని, బాధ్యుల నుంచి వివరణలు స్వీకరించామని స్పష్టం చేసింది.

**ఏఐ కంటెంట్‌కు లేబుల్స్ తప్పనిసరి**

సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఓటర్లను తప్పుదోవ పట్టించకుండా ఈసీ పకడ్బందీ చర్యలు చేపట్టింది. రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు తమ ప్రచారంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) జనరేటెడ్ కంటెంట్‌ను వాడితే, కచ్చితంగా దానికి 'ఏఐ జనరేటెడ్', 'సింథటిక్ కంటెంట్', 'డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్' లేదా 'ఏఐ ఆల్టర్డ్ కంటెంట్' అనే లేబుల్‌ను స్పష్టంగా జతచేయాలని తేల్చిచెప్పింది. దాంతో పాటు ఆ పోస్ట్ చేస్తున్న సంస్థ వివరాలను కూడా బహిర్గతం చేయాలని నిబంధన పెట్టింది. ఇక పోలింగ్ తేదీకి ముందు 48 గంటల పాటు కచ్చితంగా 'సైలెన్స్ పీరియడ్' (నిశ్శబ్ద కాలం) పాటించాలని, ఈ సమయంలో మీడియా, టీవీ ఛానళ్లు, రేడియోలు, వార్తాపత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయకూడదని దిశానిర్దేశం చేసింది. ఐటీ చట్టం కింద నోటీఫై చేయబడిన ఐటీ నోడల్ అధికారులు ఈ పోస్టులను పర్యవేక్షిస్తున్నారని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది.

**సీ-విజిల్ సక్సెస్.. 100 నిమిషాల్లో పరిష్కారం**

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు తీసుకొచ్చిన సీవిజిల్ (CVigil) యాప్‌కు విశేష స్పందన లభిస్తోంది. మార్చి 15 నుంచి ఐదు రాష్ట్రాల్లో ఈ యాప్ ద్వారా వచ్చిన మొత్తం 3,10,393 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఈసీ ప్రకటించింది. అందులో దాదాపు 96.01 శాతం ఫిర్యాదులను, కంప్లైంట్ అందిన కేవలం 100 నిమిషాల వ్యవధిలోనే పరిష్కరించడం విశేషం.

**ప్రధాని మోదీ ప్రసంగంపై సీపీఎం, సీపీఐ అభ్యంతరం**

మరోవైపు, లోక్‌సభలో వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై వామపక్షాలు (సీపీఎం, సీపీఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశాయి. ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ అయిన 'దూరదర్శన్'లో ప్రధాని ప్రసంగాన్ని ప్రసారం చేయడం.. తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఎన్నికల నియమావళిని (కోడ్) ఉల్లంఘించడమేనని ఆరోపించాయి. రాజకీయపరమైన సందేశాన్ని పంపేందుకు అధికార పక్షం ప్రభుత్వ మీడియా సంస్థను వాడుకోవడం స్వేచ్ఛా, పారదర్శక ఎన్నికల సూత్రాలకు విరుద్ధమని ఆ పార్టీలు ఆక్షేపించాయి.

# కపాలీశ్వరస్వామి సన్నిధిలో అమిత్ షా



- దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష
- పరమశివుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థన
- తమిళంలోనూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసిన కేంద్ర హోంమంత్రి

**చెన్నై, మహా:** తమిళనాడు రాజధాని చెన్నైలో పర్యటిస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, సుప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన మైలాపూర్‌లోని అరుళ్‌మిగు శ్రీ కపాలీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అత్యంత పురాతనమైన ఈ చారిత్రక ఆలయంలో ఆయన స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుని దర్శించుకుని ఆశీస్సులు పొందడం పట్ల ఆయన తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన ఆధ్యాత్మిక అనుభూతిని అమిత్ షా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "చెన్నై మైలాపూర్‌లోని శ్రీ కపాలీశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసే అదృష్టం, మహాభాగ్యం నాకు దక్కింది. ఆ కైలాసనాథుని దివ్య కరుణాకటాక్షాలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలి. ప్రతి ఒక్కరికీ ఆ పరమశివుడు మంచి ఆరోగ్యాన్ని, సకల సంపదలను, అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థించాను" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు మరింత చేరువయ్యేలా ఆయన ఈ సందేశాన్ని ఆంగ్లంతో పాటు తమిళ భాషలో పోస్ట్ చేయడం విశేషం.

**మైలాపూర్ ఆలయ విశిష్టత..**

పల్లవుల కాలం నాటి ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ మైలాపూర్ కపాలీశ్వరస్వామి దేవాలయం.. చెన్నై నగరంలో ఉన్న అత్యంత పురాతన, ప్రసిద్ధ శివాలయాల్లో ప్రముఖమైనది. అద్భుతమైన ద్రావిడ నిర్మాణ శైలి ఉట్టిపడే ఈ ఆలయంలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకునేందుకు నిత్యం దేశవిదేశాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. తాజా పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ చారిత్రక ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కాంగ్రెస్‌లో నడిచేది ఖాన్దాన్ రాజకీయాలే...




- రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న 'పిక్ పాకెటర్'
- దక్షిణాదికి ఇండీ కూటమి తీరని ద్రోహం
- బిల్లులు వీగిపోతే పైశాచిక సంబరాలు
- పార్లమెంట్‌లో రాహుల్ వ్యవహారశైలి అత్యంత బాధ్యతారాహిత్యం
- రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో విపక్షాలపై నిప్పులు చెరిగిన కేంద్రమంత్రి శోభా కరంద్లాజే

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం కాంగ్రెస్ హైకమాండ్‌ను సంతోషపెట్టడానికే ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమై రాష్ట్ర ప్రజలను వంచిస్తున్న ఆయనొక "చీటర్", "పిక్ పాకెటర్" అని కేంద్రమంత్రి శోభా కరంద్లాజే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలపై, ఇండీ కూటమి ప్రగతి నిరోధక నైజంపై నిప్పులు చెరిగారు.

**అబద్ధపు హామీలతో దగా**

తెలంగాణలో కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యం చెందిందని ఆమె మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు, నిరుద్యోగులకు భృతి, ఆసరా పెన్షన్ల పెంపు, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం వంటి భారీ హామీలు ఇచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కదానినీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్యగా మారిందని విమర్శించారు.

**ఖాన్దాన్ (వారసత్వ) రాజకీయాలకే పెద్దపీట**

కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రాధాన్యం అంటే అది కేవలం ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి ఒకే కుటుంబానికి (ఖాన్దాన్) మాత్రమే పరిమితమని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో జార్కిహోళి కుమార్తెకు టికెట్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. దీనికి భిన్నంగా బీజేపీ మాత్రమే సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలకు వారి ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పిస్తోందని స్పష్టం చేశారు. మహిళలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించి నిర్ణయాత్మక ప్రక్రియలో భాగస్వాములను చేసినప్పుడే సమాజానికి న్యాయం జరుగుతుందన్నారు. ఇక పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని, తనను తాను "జాదూగర్" (మాంత్రికుడు) అని సంబోధించుకుంటూ ఆయన అపరిపక్వంగా ప్రవర్తించారని విమర్శించారు.

**దక్షిణాదికి ద్రోహం.. బిల్లుల వైఫల్యంపై సంబరాలు**

ఏప్రిల్ 17వ తేదీ భారత మహిళల చరిత్రలో ఒక చీకటి రోజుగా (బ్లాక్ డే) మిగిలిపోయిందని కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండీ కూటమి దేశ మహిళలతో పాటు మొత్తం దక్షిణ భారతదేశాన్ని ఘోరంగా మోసం చేసిందని మండిపడ్డారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు భవిష్యత్తులో అన్యాయం జరగకుండా ఉండేందుకే ప్రధాని మోదీ 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు, ప్రతి రాష్ట్రానికి 50 శాతం ఎంపీ సీట్లు పెంచేలా డీలిమిటేషన్ బిల్లు తెచ్చారని గుర్తుచేశారు. ఈ డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో ఎంపీ సీట్లు 17 నుండి 26కు, ఏపీలో 25 నుండి 38కి పెరుగుతాయని, కానీ ఈ ప్రయోజనాన్ని ఇండీ కూటమి అడ్డుకుందని ఆరోపించారు. సరికొత్త బిల్లును తెచ్చేందుకు కేవలం ఒక గంట సమయం ఇస్తే ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టంగా ప్రతిపాదించినప్పటికీ విపక్షాలు తిరస్కరించాయన్నారు. పార్లమెంటులో బిల్లులు వీగిపోయినప్పుడు కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ నాయకులు దేశ ప్రయోజనాలను గాలికొదిలి పండుగలా సంబరాలు చేసుకున్నారని, వారి నవ్వులు, హగ్‌లు దేశాన్ని ఉత్తరదక్షిణంగా విభజించే కుట్రకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

## నరేంద్ర మోదీ పాలనలోనే మహిళా సాధికారత

గత పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే మహిళా సాధికారతకు అసలైన పెద్దపీట పడిందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. అటల్ బిహారీ వాజపేయి స్వయం సహాయక సంఘాల ఆలోచనను విస్తరించి, నేడు దేశంలో 3 కోట్లకు పైగా మహిళలను "లఖ్ పతి దీదీలు"గా తీర్చిదిద్దిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. మహిళల చేతిలో డబ్బు ఉంటే కుటుంబానికి, దేశానికి మేలు జరుగుతుందన్న ఉద్దేశంతోనే ముద్ర లోన్లలో 60 శాతానికి పైగా, ఎంఎస్ఎంఈ సబ్సిడీల్లో 53 శాతం మహిళలకే అందించామని గణాంకాలతో సహా వివరించారు. నేటి మహిళలు రక్షణ రంగంలో ఫైటర్ జెట్‌లు నడుపుతూ దేశానికి సేవ చేస్తున్నారని, అయినా రాజకీయాల్లో వారికి సరైన అవకాశాలు రాకుండా కాంగ్రెస్ లాంటి పార్టీలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కర్ణాటకలోని ఒక నిరక్షరాస్యురాలైన గ్రామ పంచాయతీ అధ్యక్షురాలి సమర్థతను, కోస్టల్ ప్రాంత మత్స్యకార మహిళల జీవనశైలిని ఉదాహరణగా చూపుతూ.. ఆర్థిక శక్తి ఉంటే మహిళల నిర్ణయాధికారం ఎలా మారుతుందో ఆమె వివరించారు. ఈ కీలక మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి, మీడియా ప్యానలిస్ట్ డా. ప్రభా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అలాంటి పాత్రలు చేయడమంటే ఇష్టం..

# ఛాంపియన్ బ్యూటీ..!

ప్రతిభ ఉంటే చాలు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. ఇందుకు ఫర్‌ఫెక్ట్ ఎగ్జాంపుల్ అనస్వర రాజన్. అతి తక్కువ కాలంలోనే మలయాళం, తెలుగు, తమిళం, హిందీ అంటూ పాన్ ఇండియా హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. 2017లో మాతృభాష మలయాళంలో ఉదహరణం సుజాత అనే చిత్రం ద్వారా రంగప్రవేశం చేసిన ఈ బ్యూటీ 9 ఏళ్లలోనే 30కి పైగా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక క్రేజ్ తెచ్చుకున్నారు. ఇటీవల తమిళంలో హీరోయిన్‌గా నటించిన విత్‌లవ్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అందులో కళాశాల విద్యార్థినిగా తన నటనతో మంచి మార్కులు కొట్టేసింది. ప్రస్తుతం తెలుగులో ఇట్లు అర్జున, తెలుగు,తమిళ భాషల్లో తెరకెక్కుతున్న 7 జీ రెయిన్‌బో కాలని చిత్రాలతో పాటు మలయాళంలో ఓ మూవీతో బిజీగా ఉన్నారు. తాజాగా ప్రత్యేక ఫొటో షూట్ నిర్వహించి ఆ ఫొటోలను సామాజిక మాద్యమాల్లో విడుదల చేశారు. అవి ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా అనస్వర రాజన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఛాలెంజింగ్ కథా పాత్రల్లో నటించడం అంటే తనకు చాలా ఇష్టం అన్నారు. ఒకే తరహా పాత్రల్లో నటించడం తనకు ఇష్టం ఉండదన్నారు. ఎలా ఇలాంటి పాత్రల్లో నటించారు అని చర్చించుకునే విధంగా బలమైన పాత్రల్లో నటించాలని ఆశిస్తున్నానన్నారు. తనకు ఛాలెంజ్‌లను ఎదుర్కోవడం ఇష్టం అన్నారు. అలాంటి వైవిధ్యభరిత కథా పాత్రల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. నిజం చెప్పాలంటే ఈ అమ్మడు ఇప్పటి వరకూ నటనకు అవకాశం ఉన్న పాత్రలనే ఎక్కువగా చేశారు.



# మృణాల్, మానస.. ఇప్పుడు సంయుక్త మీనన్?

రామ్ చరణ్ 'పెద్ది' సినిమాకు మామూలు కష్టాలు లేవు. మార్చి, ఏప్రిల్‌లో రిలీజ్ అనుకుంటే రెండుసార్లు వాయిదా పడింది. జూన్‌లో కచ్చితంగా వస్తుందని నిర్మాత ప్రకటించారు కానీ తేదీ ఎప్పుడు అనేది ఇంకా స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు 'పెద్ది'తో కాలు కదిపేందుకు ఐటమ్ సాంగ్ హీరోయిన్ దొరకట్లేదు. మృణాల్, మానస అని పలువురు బ్యూటీస్ పేర్లు గతంలో వినిపించగా ఇప్పుడు ఊహించని భామ పేరు తెరపైకి వచ్చింది. మలయాళ భామ సంయుక్తని ప్రస్తుతం 'పెద్ది' ఐటమ్ కోసం పరిశీలిస్తున్నారట. ఈమె అయినా ఫిక్సవుతుందా లేదా అనేది పక్కనబెడితే సంయుక్త పేరు మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. కెరీర్ ప్రారంభం నుంచి పెద్దగా గ్లామర్ చూపించని ఈమె.. గత చిత్రం 'అఖండ 2'లో జాజికాయ అంటూ సాగే పాటలో మాత్రం అందాలన్ని ఆరబోసింది. అటు డ్యాన్స్, ఇటు అందంతో ఆకట్టుకుంది. బహుశా ఆ సాంగ్ చూసి 'పెద్ది' కోసం అడిగారేమో అనిపిస్తుంది. సంయుక్త హీరోయిన్‌గా చేసిన 'స్వయంభు'.. పాన్ ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు 'బ్లాక్ గోల్డ్' అనే లేడీ ఓరియెంటెడ్ తెలుగు మూవీ చేస్తోంది. విజయ్ సేతుపతితో చేసిన 'స్లమ్ డాగ్' కూడా రిలీజ్ కావాల్సి ఉంది. హిందీ, తమిళ, మలయాళంలో తలో చిత్రం చేస్తోంది. భీమ్లా నాయక్, బింబిసార, సర్, విరూపాక్ష, నారీ నారీ నడుమ మురారీ తదితర చిత్రాలతో సక్సెస్‌లు అందుకున్న సంయుక్త.. 'పెద్ది'లో ఐటమ్ సాంగ్ చేస్తే మాత్రం కచ్చితంగా ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ అవుతుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com